


మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 217 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | శనివారం 2 ఆగస్టు 2025 | వెల : 2-00



## కానిస్టేబుల్ తుది పరీక్ష ఫలితాలు విడుదల

- గండి నానాజీకి మొదటి స్థానం
- 33,921 మంది ఎంపిక
- సెప్టెంబరు మొదటి వారంలో శిక్షణ ప్రారంభం
- హోంమంత్రి అనిత

స్వర్ణసాగరం విజయవాడ

పోలీసు శాఖలో కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి సంబంధించి తుది పరీక్షా ఫలితాలను హోంమంత్రి వి అనిత విడుదల చేశారు. మంగళగిరిలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఫలితాలను విడుదల చేసిన ఆమె మాట్లాడుతూ.. సివిల్ పోలీసు కానిస్టేబుళ్లు 3,580 పోస్టులు, ఎపిఎస్‌పి కానిస్టేబుళ్లు 2,520 పోస్టులు చొప్పున మొత్తం 6,100 పోస్టుల భర్తీకి నిర్వహించిన తుది పరీక్షా ఫలితాల్లో విశాఖపట్నానికి చెందిన గండి నానాజీ 168 మార్కులతో ప్రథమ స్థానం, విజయనగరానికి చెందిన జి రమ్య మాధురి 159 మార్కులతో ద్వితీయ స్థానం, - మిగతా3లో

## గతం కంటే రెండింతలు అదనంగా

# సంక్షేమం

- ఆటోలో ప్రయాణించి.. ఔరా అనిపించి
- పింఛన్ల పంపిణీ అనంతరం ఆటోలో ప్రజావేదిక వద్దకు
- మగ్గాలున్న చేనేతలకు ఉచిత విద్యుత్
- కడప స్టీల్‌ప్లాంట్ లో 2029 నాటికి ఉత్పత్తి ప్రారంభం
- మహిళను బూతులు తిడితే మందలించాల్సిన జగన్ ఇంకా తిట్టమని ప్రోత్సహిస్తున్నాడు
- జమ్మలమడుగు ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు



స్వర్ణసాగరం జమ్మలమడుగు

ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లుగానే మారిపోయాడు. ఔరా అనిపించేలా ఆటోలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్య పరిచారు. శుక్రవారం కడప జిల్లా జమ్మలమడుగు నియోజవర్గం చెరువు ఊరు గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. అక్కడి నుంచి ప్రజావేదిక ఏర్పాటు చేసిన జమ్మలమడుగు వరకు ఆయన వాహనంలో కాకుండా అక్కడి నుంచి జగదీష్ కు చెందిన ఆటోలో ప్రజావేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవర్ లూమ్స్ ఉన్నవారికి 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్ ఉన్నవారికి 200 యూనిట్ల మేర విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈనెల 7వ తేదీన అంతర్జాతీయ చేనేత దినోత్సవం - మిగతా3లో



## రాహుల్ గాంధీ చిన్న పిల్లవాడేమీ కాదు

- భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ మద్దతు
- రాహుల్ వైఖరితో విభేదించిన కాంగ్రెస్ సీనియర్లు శశి థరూర్, రాజీవ్ శుక్లా
- ఇది దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడమేనన్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



## భారతీయులకు 10 లక్షల ఉద్యోగాలు.. మాతో కలవండి

- బలూచిస్థాన్ నేత కీలక ప్రతిపాదన
- భారత ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలకు బలూచ్ మానవ హక్కుల నేత లేఖ
- బలూచిస్థాన్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కీలక పిలుపు
- భారత నిపుణులకు 10 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పిస్తామని ప్రతిపాదన

## లిక్కర్ స్కాంలో రోజుకో పిట్ట కథ



- 'కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ఘోరంగా విఫలమైంది
- ప్రజల తిరస్కరణకు గురైన కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతుంది
- లిక్కర్ స్కాం పేరుతో ప్రజల దృష్టిని మరల్చాలని భావిస్తుంది

స్వర్ణసాగరం విజయవాడ

ఏపీలో లిక్కర్ స్కాంలో కూటమి నేతలు రోజుకో పిట్ట కథ చెబుతున్నారని ఆరోపించారు వైఎస్సార్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి. ప్రజల దృష్టిని మరల్చడానికి లిక్కర్ స్కాంను తెర మీదకు తెచ్చారని వ్యాఖ్యలు చేశారు. పెద్ద పెద్ద లిక్కర్ బ్రాండ్లు తీసుకువస్తే లిక్కర్ రెవెన్యూ పెరగాలి కదా? అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. 'కూటమి ప్రభుత్వం - మిగతా3లో

## మా దగ్గర ఆటంబాంబు లాంటి ఆధారాలున్నాయి

- ఈసీని విడిచిపెట్టే ప్రసక్తే లేదు..!
- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఈసీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టింది
- ఆ విషయాన్ని రుజువు చేసేందుకు తమవద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయి
- లోక్‌సభ లో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ

## భారత్‌లో ఒక చిన్న వ్యాపారి కూడా ట్రంప్‌కు ఆర్థిక పాఠాలు నేర్పించగలడు

- భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ వ్యాఖ్యలపై మాజీ ప్రధాని దేవెగౌడ తీవ్ర ఆగ్రహం
- ట్రంప్ బెదిరింపులకు మోదీ ప్రభుత్వం లొంగలేదని ప్రశంసల వర్షం
- ట్రంప్ అస్థిరమైన, బాధ్యతారహితమైన నేత అని తీవ్ర విమర్శలు
- ట్రంప్ వ్యాఖ్యలను సమర్థించే విపక్ష నేతలకు దేవెగౌడ హితవు



## గుంటూరు జిల్లా అభివృద్ధిపై కేంద్రమంత్రి పెమ్మసాని స్పెషల్ ఫోకస్

- రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన
- రాఘవేంద్రప్రసాద్, కల్యాణి దంపతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం రూ.4 కోట్లు విరాళం ఇవ్వడం అభినందనీయం
- దాతల విరాళంలోని రూ.40 లక్షలతో బీసీల కమ్యూనిటీ భవన నిర్మానానికి శంకుస్థాపన
- ఎనిమిది నెలల్లో నంది వెలుగు బ్రిడ్జి పూర్తి చేస్తాం



స్వర్ణసాగరం గుంటూరు

గుంటూరు జిల్లా అభివృద్ధిపై కేంద్రమంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇవాళ(శుక్రవారం) పొన్నూరు మండలం మామిళ్ళపల్లిలో రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ధూలిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మీడియాతో మాట్లాడారు. రాఘవేంద్రప్రసాద్, కల్యాణి దంపతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం రూ.4 కోట్లు విరాళం ఇవ్వడం అభినందనీయమని ప్రశంసించారు. దాతల విరాళంలోని రూ.40 లక్షలతో బీసీల కమ్యూనిటీ భవన నిర్మానానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. బీసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఈ భవన నిర్మాణ శంకుస్థాపన చేపట్టిందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. అంతకు ముందు.. గుంటూరు నగరాభివృద్ధిపై నగర కార్పొరేషన్ లో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. గుంటూరు నగరంలోని సమస్యలపై - మిగతా3లో



## ఏపీలో కక్ష సాధింపు సంస్కృతి తెచ్చిందే జగన్

- చంద్రబాబు సంయమనం వల్లే జగన్ ఇంకా రోడ్లపై తిరుగుతున్నారు
- వైకాపా కక్ష సాధింపు జాబితా పంపుతానని, జగన్ చదువుకోవాలని ఎద్దేవా
- ఆయన కేవలం రాష్ట్రం మంచి కోసమే ఆలోచిస్తున్నారు. జగన్ రాకముందు రాష్ట్రంలో కక్షసాధింపులు లేవు.

## సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక



- ఉపరాష్ట్రపతి పదవిని భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల
- పదవి ఖాళీ అయితే వెంటనే భర్తీ చేయాలన్న నిబంధన ఉండటంతో ఉపరాష్ట్రపతి రాజీనామా అధికారికంగా ఆమోదం పొందిన వెంటనే సన్నాహాలు
- లోక్ సభ, రాజ్యసభల్లో సభ్యులంతా ఓటు హక్కు కలిగి ఉంటారు
- రాష్ట్రపతి ఎన్నికల్లో అయితే ఎమ్మెల్యేలు కూడా ఓటర్లుగా కూడా ఉంటారు.

# సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక



**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి పదవిని భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. పదవి ఖాళీ అయితే వెంటనే భర్తీ చేయాలన్న నిబంధన ఉండటంతో ఉపరాష్ట్రపతి రాజీనామా అధికారికంగా ఆమోదం పొందిన వెంటనే సన్నాహాలు ప్రారంభించింది. ఓటర్ల జాబితాను రెడీచేసింది. లోక్ సభ, రాజ్యసభల్లో సభ్యులంతా ఓటు హక్కు కలిగి ఉంటారు. రాష్ట్రపతి ఎన్నికల్లో అయితే ఎమ్మెల్యేలు కూడా ఓటర్లుగా కూడా ఉంటారు.కానీ ఉపరాష్ట్రపతి పదవికి మాత్రం పార్లమెంట్ సభ్యులు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఏడో తేదీ నుంచి నామిషన్లు ప్రారంభమవుతాయి. 21వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. పోలింగ్ అవసరం అయితే వచ్చే నెల తొమ్మిదో తేదీన నిర్వహిస్తారు. అదే రోజు కౌంటింగ్ నిర్వహిస్తారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎవరు అన్నదానిపై అధికార ఎన్డీఏలో ఇంకా క్లారిటీ లేదు. బీహార్ సీఎం నితీష్ కుమార్ తో సహా చాలా మంది పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి. నామినేషన్లకు చివరి తేదీ ఆగస్టు 21వ తేదీ కాబట్టి.. చివరి వరకూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉండదని భావిస్తున్నారు. నామినేషన్ల గడువుకు రెండు రోజుల ముందు బీజేపీ హైకమాండ్ పేరును ఖరారు చేసే అవకాశం ఉంది. ఎవరూ ఊహించని అభ్యర్థులను రంగంలోకి తీసుకు వచ్చే చాన్సులు ఉన్నాయి. బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉపరాష్ట్రపతిని ఎంపిక చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. మిత్రపక్షాలకు ఇచ్చే అవకాశం లేదని.. బీజేపీ నుంచి మాత్రమే ఉపరాష్ట్రపతి ఉంటారని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. మరో వైపు ఇండియా కూటమి అభ్యర్థిని నిలబెట్టకపోతే ఏకగ్రీవం అవుతుంది. పోటీకి అభ్యర్థిని పెట్టాలని ఇండియా కూటమి భావిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే ఓటింగ్ ఖాయం. ఓటింగ్ జరగాల్సి వస్తే సెప్టెంబర్ 9న నిర్వహిస్తారు. కౌంటింగ్ కూడా అదే రోజు జరుగుతుంది. ఉపరాష్ట్రపతిని పార్లమెంటు ఉభయ సభలకు ఎన్నికైన, నామినేటెడ్ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటుంది. ఎన్నిక ఒకే బదిలీ ఓటు ద్వారా జరుగుతుంది. గెలుపొందడానికి అభ్యర్థికి సభలోని మొత్తం ఓట్లలో సగం కంటే ఎక్కువ అంటే సాధారణ మెజారిటీ అవసరం. అభ్యర్థి నామినేషన్‌ను దాఖలు చేయడానికి కనీసం 20 మంది ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు ప్రతిపాదకులుగా, 20 మంది బలపరిచేవారిగా సంతకం చేయాలి. ఉపరాష్ట్రపతి పదవీకాలం 5 సంవత్సరాలు. 2025 జులై 21న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఆరోగ్య కారణాలతో రాజీనామా చేశారు. దీంతో కొత్త ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ప్రస్తుతం జరిగేది ఉపఎన్నిక కాదు. అందుకే ఎన్నికయ్యే వారు ఐదేళ్లు పదవిలో ఉంటారు. ఉపరాష్ట్రపతి రాజ్యసభ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు . రాష్ట్రపతి పదవి ఖాళీ అయినప్పుడు తాత్కాలిక రాష్ట్రపతిగా విధులు నిర్వహిస్తారు .

# కాళేశ్వరం రిపోర్ట్... అధికారులపై చర్యలేవి

**కరీంనగర్ :** కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు, అవకతవకలు అంటూ మొదటి నుంచి బలంగా విమర్శిస్తూ వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడిన తరువాత విచారణ సంస్థల సిఫారసుల ప్రకారం చర్యలు తీసుకోవడంలో మాత్రం అంత వేగంగా అడు గులు వేయడం లేదు. 2023 డిసెంబరులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం.. కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణకు ఆదేశించడం.. ఆపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేయడం చాలా వేగంగా సాగింది. అయితే విజిలెన్స్ విచారణ నివేదిక వచ్చినప్పటికీ.. చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతుందనే ఆరోపణలున్నాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు తరువాత కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్, ఎన్‌ఫో ర్స్‌మెంట్ విచారణకు ఆదేశించింది. దాదా పు ఏడాదికిపైగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేసిన విచారణలో అత్యంత కీలకమైన సమాచారం, రికార్డులు, ఫైళ్లు బయట కు వచ్చాయి. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్, నిర్మాణ ప్రారంభ పనుల నుంచి మొదలుకుని.. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ ఏడో నెంబరు బ్లాక్ కుంగుబాటు వరకు అస లు ఏం జరిగింది.. ఎలాంటి లోటుపాట్లు ఉన్నాయి.. ఎవరి బాధ్యత ఎంతవరకు ఉం ది.. ఎవరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.. తదితర అన్ని అంశాలతో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రాష్ట్ర విజిలెన్స్ కమి షన్‌కు నివేదికను ఇచ్చింది. దీనిని పరిశీలించిన విజిలెన్స్ కమిషన్ ఎవరెవరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.. ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది సిఫా రసు చేస్తూ.. 18.3.2025న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను అందించింది. దాదాపు 10 పేజీల విజిలెన్స్ కమిషన్ నివేదికలో.. ఆర్థిక శాఖ, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలతోపాటు బాధ్యులైన వారి సబార్డినేట్స్‌పై కూడా చర్యలు తీసుకునేందుకు ఆలోచించాలని స్పష్టంగా సిఫారసు చేసింది. బాధ్యులైనవారిని పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ కమిషన్ సిఫారసులను 18.3.2025న ప్రభుత్వానికి కమిషన్ లేఖ రాసింది. అంటే ఇప్పటికి దాదాపు నాలుగున్నర నెలల కాలం గడిచింది. ఇప్పటివరకు అటు ఆర్థిక శాఖ, ఇటు నీటిపారుదల శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలుగా (విజిలెన్స్ కమిషన్ పేర్కొన్న ఏప్రిల్ 2015 నుంచి 21.10.2023 వరకు) పనిచేసిన ఐఏఎస్ అధికారులపై చర్యలు తీసుకోవడానికి మాత్రం ప్రభుత్వం జంకుతూనే ఉన్నట్టు



కనపడుతోంది. విజిలెన్స్ కమిషన్ పేర్కొన్నట్టు.. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్ చేసినప్పటి నుంచి మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌కు పగుళ్లు వచ్చి కుంగినప్పటి వరకు నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ/స్పెషల్ చీఫ్ సెక్రటరీలుగా పలువురు పనిచేశారు. గతంలో సీఎస్‌గా చేసి రిటైర్డ్ అయిన ఎస్.కె. జోషి అంతకుముందు నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. తరువాత వికాస్‌రాజ్ నీటి పారుదల శాఖ సెక్రటరీగా, ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2021 జనవ రి, ఫిబ్రవరిలో చీఫ్ సెక్రటరీగా పనిచేసిన సోమేశ్‌కుమార్ నీటిపారుదల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగాకూడా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత రజత్‌కుమార్ 2021 ఫిబ్రవరి నుంచి 2023 నవంబర్ వరకు నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తించారు. వీరెవరికీ నోటీసులు ఇవ్వలేదు. చర్యలు తీసుకోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి, అక్రమాలు, అవకతవకలు జరిగాయని బలంగా చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ సంస్థల నుంచి వచ్చిన నివేదికల ప్రకారం చర్యలు తీసుకోవడానికి మాత్రం ఎందుకో తాత్సారం చేస్తున్నట్టుగా అర్థమవుతోంది. ఎంత బలంగా విమర్శలు చేశారో.. అంతే వేగంగా విచారణకు ఆదేశించిన ప్రభుత్వం.. చర్యల విషయంలో మాత్రం ఆ వేగాన్ని ప్రదర్శించడం లేదనే విమర్శలు వినపడుతున్నాయి. పైపెచ్చు.. కేవలం ఇంజినీ ర్లనే బాధ్యులుగా చేస్తున్నారని, ప్రాజెక్టులకు సారథ్యం వహించిన ఉన్నతాధికారులు, ఐఏఎస్‌లపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం అంతగా సుముఖంగా లేదనే సంకేతాలు స్పష్టంగా కనపడటంపై కూడా విమర్శలు వస్తున్నాయి. కుటుంబాలకు దూరంగా క్షేత్రస్థాయిలో పనులు చేస్తున్న తమలాంటి కింది స్థాయి ఉద్యోగులపై ప్రభుత్వం చర్యల పేరు తో కొరడా ఝులిపిస్తోంది. అదే విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన నివేదికలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ.. ఉన్నతస్థాయి అధికారులు, ఐఏఎ స్‌లపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం జంకుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్ చేసినప్పటి నుంచి అంటే.. ఏప్రిల్ 2015 నుంచి మేడిగడ్డ బ్యారేజీ ఏడవ బ్లాక్ కుంగిన వరకు.. అంటే 21.10.2023 వరకు ఈ ఆర్థిక, నీటిపారుదల రెండు శాఖలకు ప్రిన్సిపల్ సెక్రటరీలుగా పనిచేసినవారితోపాటు బాధ్యులైన వారి సబార్డినేట్స్‌పై చర్యలు తీసుకోవడానికి ఆలోచించాలంటూ స్పష్టంగా పేర్కొ న్నారు. ఇందుకు ప్రధాన కారణాలను తెలుపుతూ ప్రాజెక్టు విషయంలో వచ్చిన ప్రతిపాదనల లోటుపాట్లను చూడకుండా గుడ్డిగా ఆమోదించడం వలన వారిపై చర్యలు తీసుకో వడానికి ఆలోచించాలంటూ విజిలెన్స్ కమిషన్ స్పష్టంగా పేర్కొంది.

# ఎఫ్ 35 విమానాల కొనుగోళ్లకు బ్రేక్

**న్యూఢిల్లీ :** భారత్‌పై అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పిడుగు వేశారు. పాతిక శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించారు. దీనికి అనేక కారణాలు చెబుతున్నా.. అక్కసుతోనే ఈ టారిఫ్‌లు వేశారన్నది సుస్పష్టం. బ్రిక్స్‌లో భాగమైనందుకు, రష్యా ఆయిల్ కొంటున్నందుకు, తమ వస్తువులపై ఎక్కువ పన్నులు వేస్తున్నందుకు ఇలా అనేక విషయాలను మనసులో పెట్టుకుని ట్రంప్ భారత్‌పై పిడుగులాంటి టారిఫ్‌ను సంధించారు. ఇది ప్యూర్ మైండ్‌గేమ్‌తో తీసుకున్న డెసిషన్. దీంతో భారత్‌లో పొలిటికల్ దుమారం కూడా చెలరేగింది. ఈ క్రమంలోనే వాణిజ్య ఒప్పందం గురించి భారత్–అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, ఈలోగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 7 నుండి ఈ సుంకాలు అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలోనే భారతదేశం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నివేదిక ప్రకారం, అమెరికాకు ఈ–35 యుద్ధ విమానాలను కొనుగోలు చేయడానికి భారత్ నిరాకరించింది. అమెరికన్ ఉత్పత్తుల కొనుగోలును వేగవంతం చేయాలని భారత ప్రభుత్వం ఆలోచిస్తున్నప్పటికీ, అమెరికా నుండి అదనపు రక్షణ ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం లేదని అధికారులను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ తన కథనంలో పేర్కొంది. బ్లూమ్‌బెర్గ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఈ–35 స్టీల్త్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోలుపై ఆసక్తి లేదని భారత్ అమెరికాకు తెలియజేసిందని పేర్కొంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 2025లో అమెరికాను సందర్శించారు. వైట్ హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలిశారు. ఈ సందర్భంగా, ట్రంప్ భారతదేశానికి ఈ–35 యుద్ధ విమానాలను విక్రయించడానికి ముందుకొచ్చారు. అయితే దేశీయంగా రక్షణ పరికరాల ఉమ్మడి రూపకల్పన, తయారీపై దృష్టి సారించిన భాగస్వామ్యాలపై భారత ప్రభుత్వం ఎక్కువ ఆసక్తి చూపుతుందని అధికారులు తెలిపారు. దీనిపై భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఇంకా స్పందించలేదు. ఆగస్టు 1 నుండి భారతదేశం నుండి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం సుంకాన్ని ప్రకటించారు. రష్యా నుండి దిగుమతులకు శిక్షాత్మక చర్యగా భారతదేశంపై జరిమానాను కూడా విధించారు. ఇది 25 శాతం సుంకం నుండి వేరుగా ఉంటుంది. భారతదేశం సుంకాలు చాలా ఎక్కువగా ఉన్నందున అమెరికా భారతదేశంతో సాపేక్షంగా తక్కువ వాణిజ్యం చేసిందని ట్రంప్ భావిస్తున్నారు. భారతదేశంపై డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించిన తర్వాత, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ పార్లమెంటులో ఒక ప్రకటన చేశారు. సుంకాల ప్రభావాలను అంచనా వేస్తున్నామని, జాతీయ ప్రయోజనాలను పరిరక్షించడానికి, ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పియూష్ గోయల్ అన్నారు. రైతులు, కార్మికులు, వ్యవస్థాపకులు, ఎగుమతిదారులు, ఓఎస్ఇలు, పరిశ్రమలోని అన్ని వాటాదారుల రక్షణ, ప్రోత్సాహానికి మోదీ ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యతనిస్తుందని పియూష్ గోయల్ పార్లమెంటులో స్పష్టం చేశారు.



## రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తప్పుపట్టిన కాంగ్రెస్ ఎంపీలు

**న్యూఢిల్లీ :** భారత్, రష్యా సంబంధాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమర్థించడాన్ని సొంత పార్టీకి చెందిన ఎంపీ శశిథరూర్ తప్పుబట్టారు. రాహుల్ వ్యాఖ్యలతో తాను విభేదిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.వాణిజ్య ఒప్పందాల గురించి మాట్లాడుతూ, భారత్–రష్యా ఆర్థిక వ్యవస్థలు ఇప్పటికే పతనమయ్యాయని, వాటిని మరింత దిగజార్చుకోవద్దని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ ట్రంప్ వాస్తవం చెప్పారంటూ రాహుల్ గాంధీ సమర్థించారు. రాహుల్ గాంధీ తీరుపై అధికార పక్షం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పుడు సొంత పార్టీ నేతల నుంచి ఆయన విమర్శలు ఎదుర్కొంటున్నారు.ట్రంప్‌ను రాహుల్ గాంధీ సమర్థించడంపై పార్లమెంటు వెలుపల మీడియా ప్రశ్నించగా, థరూర్ కొట్టిపారేశారు. భారత ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో అందరికీ తెలుసని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో ఎంపీ కార్తి చిదంబరం కూడా రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో విభేదించారు. ట్రంప్ సంప్రదాయేతర రాజకీయ నాయకుడంటూ చురకలు అంటించారు.

## అనిల్ అంబానీకి కొత్త కష్టాలు

**ముంబై :** రూ.17,000 కోట్ల బ్యాంకు రుణ మోసం కేసులో రిలయన్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసింది. ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం, ఆగస్టు 5న ఢిల్లీలోని తన ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఇడి ఆయనను ఆదేశించింది. గత వారం, మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఢిల్లీ నుంచి ముంబై వరకు రిలయన్స్ గ్రూప్‌కు సంబంధించిన దాదాపు 35 ప్రదేశాలపై ఇడి దాడులు చేసింది. ఈ దాడుల సమయంలో, అనేక పత్రాలు, ఆర్థిక లావాదేవీలు, డిజిటల్ రికార్డులు, ఇతర ఆధారాలు స్వాధీనం చేసుకున్నాయి.రూ.10,000 కోట్ల నిధుల మళ్లింపునకు సంబంధించి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా తన దర్యాప్తు నివేదికను ఇడి, ఇతర రెండు కేంద్ర దర్యాప్తు సంస్థలకు సమర్పించింది. రుణ మొత్తాన్ని ఇతర కంపెనీలకు మళ్లించి, మనీలాండరింగ్ పరిధిలోకి వచ్చే నిర్దేశించిన ప్రయోజనం కాకుండా ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించారని అందులో స్పష్టంగా వివరించింది. రిలయన్స్ గ్రూప్‌కు చెందిన అనేక కంపెనీలు యెస్ బ్యాంక్ నుంచి తగిన హామీ లేకుండా పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నాయని, షెల్ కంపెనీల ద్వారా ఇతర పనులకు డబ్బు ఖర్చు చేశారని కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపించింది. ఈ కేసులో సీబీఐ గతంలో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది, ఆ తర్వాత ఇడి దర్యాప్తు ప్రారంభించింది. 66 ఏళ్ల అంబానీని ఏజెన్సీ ఢిల్లీ ప్రధాన కార్యాలయంలో హాజరు కావాలని కోరినట్లు అధికారిక వర్గాలను ఉటంకిస్తూ ఖుఏ నివేదించింది. గత వారం ఇడి అంబానీ వ్యాపార సామ్రాజ్యానికి సంబంధించిన కార్యాలయాల్లో నిర్వహించిన వరుస హై-ప్రొఫైల్ సోదాల తర్వాత ఈ చర్య తీసుకున్నారు. ఆర్థిక అవకతవకలు, వివిధ రిలయన్స్ గ్రూప్ సంస్థలకు పంపిణీ చేసిన రుణాలను పెద్ద ఎత్తున మళ్లించడం వంటి ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు సంస్థ జులై 24న విస్తృతమైన దాడులు చేసింది. ఇది ముంబైలోని 35 కంటే ఎక్కువ ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని వరుసగా మూడు రోజులుపాటు కొనసాగింది. రిపోర్ట్స్ ప్రకారం, ఈ సోదాలు 50కి పైగా కంపెనీలు, 25 మంది వ్యక్తులకు సంబంధించిన ప్రాంగణాలలో సాగినట్టు తెలుస్తోంది. వీటిలో అనిల్ అంబానీ కార్పొరేట్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న అనేక మంది కార్యనిర్వాహకులు ఉన్నారు. 2017 -2019 మధ్య యెస్ బ్యాంక్ అంబానీ కంపెనీలకు అక్రమంగా రుణాలను మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా యెస్ బ్యాంక్ అంబానీ కంపెనీలకు పంపిణీ చేసిన సుమారు రూ. 3,000 కోట్లతో ముడిపడి ఉంది. లంచాలు, అక్రమ రుణ ఆమోదాలు జరిగినట్టుదర్యాప్తు సంస్థ అధికారులు గుర్తించారు. ఇక్కడ యెస్ బ్యాంక్ ప్రమోటర్లు రుణాలు మంజూరు చేయడానికి ముందు వారి వేర్వేరు సంస్థల ద్వారా నిధులు పొందారని ఆరోపణలు ఉన్నాయి. ఈ లావాదేవీలలో నకిలీ లేదా ఓల్డ్ డాక్యుమెంట్స్ ఉన్నాయా, వాటిలో సందేహాస్పద క్రెడిట్ ఆమోదం మెమోలు ఉన్నాయా అని ఇడి ఇప్పుడు పరిశీలిస్తోంది. కొన్ని పెట్టుబడులు బేసిక్ రెస్పాన్సిబులిటీ లేకుండా లేదా బ్యాంకు అంతర్గత క్రెడిట్ విధానాలకు కట్టుబడి ఉండకుండా జరిగినట్టు అధికారులు ఆరోపిస్తున్నారు, ఇది వ్యవస్థాగత ఉల్లంఘనలకు పాల్పడటమేనని భావిస్తున్నారు. గ్రూప్‌లోని రెండు లిస్టెడ్ సంస్థలు, రిలయన్స్ పవర్ ,రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇడి చర్యలను అంగీకరిస్తూ ప్రకటనలు జారీ చేశాయి. కొనసాగుతున్న దర్యాప్తు వారి కార్యకలాపాలు, ఆర్థిక వ్యవహారాలపు, వాటాదారులపై "ఎటువంటి ప్రభావం చూపలేదని" నొక్కి చెప్పాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్ రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ దశాబ్ద కాలం నాటి గత లావాదేవీలపై మీడియా రిపోర్ట్‌లపై మాత్రం కంపెనీలు స్పందించలేదు.కేసు లోతుల్లోకి వెళ్తున్న కొద్దీ, దారి మళ్లించిన నిధులు, మళ్లించడానికి ఉపయోగించిన షెల్ కంపెనీల పాత్ర దేశంలో కార్పొరేట్ పాలన, బ్యాంకింగ్ పారదర్శకతపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

## రష్యాతో భారత్ చమురు బంధమే..

**న్యూ ఢిల్లీ :** రష్యాతో భారత్ చమురు బంధమే.. న్యూఢిల్లీతో చర్చల్లో తమకు చికాకు తెప్పించే అంశమని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో అన్నారు. .. 'రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లే ఉక్రెయిన్‌లో మాస్కో యుద్ధ ప్రయత్నాలను నిలబెట్టడానికి సాయపడుతోంది. భారత్ కొంటున్న చమురుతోనే పుతిన్.. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇదే మతను ఇబ్బందిపెట్టే అంశమని స్పష్టం చేశారు.ఫాక్స్ రేడియోకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మార్కో రూబియో మాట్లాడుతూభారత్‌కు భారీగా ఇంధన అవసరాలున్నాయి. అన్ని దేశాల్లాగే ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు చమురు, బొగ్గు, గ్యాస్ కొనగలిగే శక్తి భారత్‌కు ఉంది. అయితే, రష్యాపై పలు దేశాల ఆంక్షల వల్ల అక్కడ భారత్‌కు చమురు చౌకగా లభిస్తోంది. దీంతో న్యూఢిల్లీ తమ అవసరాల దృష్ట్యా రష్యా నుంచి చమురును తక్కువ ధరకు కొనుగోలు చేస్తోంది. దురదృష్టవశాత్తూ భారత్ చమురు కొనుగోలు వల్లే రష్యాకు నిధులు సమకూరుతున్నాయి. వాటిని మాస్కో.. ఉక్రెయిన్‌లో యుద్ధం కోసం వాడుకుంటోంది. ఇదే భారత్‌తో చర్చల్లో అమెరికాకు చికాకు తెప్పించే అంశం. ప్రపంచ వాణిజ్యంలో భారత్ వాటాదారు. వ్యూహాత్మక భాగస్వామి. అన్ని అంశాల్లో మాదిరిగా విదేశాంగ విధానంలోని ప్రతి విషయంలోనూ 100 శాతం సమయాన్ని కేటాయించడం సాధ్యంకాదు. అని అన్నారు.

## మా దగ్గర ఆటంబాంబు లాంటి ఆధారాలున్నాయి



భారత ఎన్నికల సంఘంపై లోక్‌సభ లో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. బీజేపీ కోసం ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఆ విషయాన్ని రుజువు చేసేందుకు తమవద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని చెప్పారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఈసీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టింది. దానికి సంబంధించి ఇవాళ ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసింది. అయితే ఈ సవరణను ముందు నుంచీ వ్యతిరేకిస్తున్న రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రస్థాయి నుంచి ఓట్ల చౌర్యం జరుగుతోందని తాము ఎప్పటినుంచో అనుమానిస్తున్నామన్నారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రతోపాటు లోక్‌సభ ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఓటరు సవరణ చేపట్టి కోట్లాది మంది కొత్త ఓటర్లను అదనంగా చేరుస్తున్నారని, దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేస్తే ఈసీ వ్యవహారం బయటపడిందని చెప్పారు. ఆరు నెలలపాటు తాము సొంతంగా దర్యాప్తు జరిపి ఆటమ్ బాంబు లాంటి ఆధారాలను సాధించామన్నారు. ఆ బాంబు పేలిన రోజు ఎన్నికల సంఘం దాక్కోవడానికి కూడా అవకాశమే ఉండదని రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. బీజేపీ కోసమే ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని, ఇది దేశద్రోహం కంటే తక్కువేం కాదని మండిపడ్డారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఏ ఒక్కరినీ తాము వదిలిపెట్టబోమని హెచ్చరించారు. అధికారులు రిటైర్ అయినా, ఎక్కడ దాక్కున్నా కనిపెడతామని వార్నింగ్ ఇచ్చారు.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# గతం కంటే రెండింతలు
# అదనంగా సంక్షేమం

-మొదటిపేజీ తరువాయి

రోజు నుంచి ఈ పథకం అమల్లోకి రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించడంతో పాటు పెట్టుబడుల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తన సింగపూర్ పర్యటన విశేషాలను చెప్పారు. "రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు, రాష్ట్ర బ్రాండ్ పెంచేందుకు సింగపూర్ వెళ్లొచ్చాను. నేను ఎక్కడ ఉన్నా ఒకటో తేదీన పేదల సేవలో పాల్గొనేలా చూసుకుంటున్నాను. అవసరమైతే నా కార్యక్రమాలు వాయిదా వేసుకుంటాను. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏదో మొక్కుబడిగా కాకుండా ఒక బాధ్యతగా చేస్తున్నాం. రాష్ట్రంలో 64 లక్షల మందికి రూ.33 వేలకోట్లు వెచ్చిస్తున్నాం. దేశవ్యాప్తంగా పెన్షన్ల కోసం ఇంతపెద్ద మొత్తంలో ఖర్చు చేసేది ఏపీనే. మన రాష్ట్రం తర్వాత తెలంగాణ రూ. 8,170 కోట్లు, కేరళ రూ. 7,295 కోట్లు, హర్యానా రూ.7,194 కోట్లు, వెస్ట్ బెంగాల్, 5,460 కోట్లు, రాజస్థాన్, రూ.5,160 కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నారు. 1,08,499 మందికి కొత్తగా వితంతు పెన్షన్లు ఇచ్చేందుకు రూ.43.40 కోట్లు విడుదల చేశాం. రెండు నెలల పాటు పింఛన్లు తీసుకోకపోయినా మూడు నెలలో కలిపి ఒకేసారి ఇస్తున్నాం. ఆస్పత్రుల్లో ఉన్న 14,703 మందికి, వృద్ధాశ్రమాల్లో ఉన్న 20,587 మందికి, ఒక సచివాలయ పరిధి నుంచి మరో సచివాలయ పరిధికి వెళ్లిన 31,496 మందికి, హాస్టళ్లలో ఉంటున్న దివ్యాంగ విద్యార్థులకు 3,683 మందికి ఇస్తున్నాం. ఇవి కాకుండా ఈ నెల నుంచి కొత్తగా 1.09 లక్షల మందికి స్పౌజ్ ఫించన్లు అందిస్తున్నాం. దీనికోసం రూ.520 కోట్లు ఖర్చు పెడుతున్నాం' అని సీఎం వివరించారు. కడప స్టీల్ ప్లాంట్ పనులు మొదలు పెడతామని చెప్పాం. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ముందుకొచ్చింది. రూ.4,500 కోట్లతో తొలి దశ, రూ.11,850 కోట్లతో రెండో దశ పనులు చేపడుతుంది. 2029 కల్లా ఉత్పత్తి ప్రారంభిస్తుంది. ఈ ప్రాజెక్టు వస్తే జమ్మలమడుగుతో పాటు పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాం. సాస్కి పథకం కింద రూ.80 కోట్లతో కేంద్ర పర్యాటకశాఖ పనులు చేపడుతోంది. అందమైన లోయలున్న గండికోటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం. 100 అడుగుల ఎత్తులో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం ఏర్పాటు చేస్తాం. ఓవైపు గండికోట, మరోవైపు ఒంటిమిట్ట మధ్యలో కడప దుర్గా...ఈ మూడింటిని అనుసంధానం చేస్తే పర్యాటకంగా సీమ అభివృద్ధి చెందుతుంది' అని సీఎం వివరించారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తా మని చెప్పిన మాటను నిలబెట్టుకుంటున్నాం. నాడు హంద్రీనీవా, గాలేరి నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. తెలుగుగంగ ద్వారా సీమకు నీళ్లిచ్చాకే చెన్నైకి వెళతాయని చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్. హంద్రీనీవా పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నాం. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాం. హంద్రీనీవా ప్రాజెక్టుకు ఒక్క ఏడాదినే రూ.3,890 కోట్లు ఖర్చు చేశాం. జూలైలోనే మల్యాల ఎత్తిపోతల నుంచి సీమ జిల్లాలకు నీరు విడుదల చేశాం. ఫేజ్ 2 పనులు త్వరలో పూర్తిచేసి కడప జిల్లాలో 37,500 ఎకరాలకు సాగునీరు అందిస్తాం. గండికోట ప్రాజెక్టు ఎన్టీఆర్ ప్రారంభిస్తే నేను పూర్తి చేశాను.' అని ముఖ్యమంత్రి అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఘరానా మోసగాడు. సొంత పత్రిక, టీవీని అడ్డంపెట్టుకుని తప్పుడు ప్రచారాలతో ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. సాక్షి మీడియాను అనుసరిస్తే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్టే. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడిన మందలించాల్సిందిపోయి...ఇంకా నోటికొచ్చినట్టు మాట్లాడాలని ప్రోత్సహించడాన్ని ఏమనాలి.? పార్టీ అధినేతగా ఉన్న వ్యక్తి తన పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలను క్రమశిక్షణలో ఉంచాలి. వైసీపీ వాళ్లు దుష్ప్రచారం చేస్తుంటారు. ఆనాడు వివేకానందరెడ్డికి గుండెపోటు అని సాక్షిలో వేశారు. తర్వాత గొడ్డలిపోటు అని తేలింది. నా చేతిలో కత్తిపెట్టి నేను చంపించానని రాశారు. బంగారుపాళ్యం పర్యటన దృశ్యాలను నెల్లూరు పర్యటన దృశ్యాలతో కలిపి భారీగా జనం వచ్చినట్లు చూపించారు. జిమ్మిక్కులతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు. ప్రజలను మభ్య పెట్టి, మోసం చేసి అసౌర్యం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.



చెప్పినట్టే శనివారం అన్నదాత సుఖీభవ కింద రైతులందరికీ డబ్బు జమ చేస్తాం. కేంద్రం ఇచ్చే రూ.2 వేలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కో రైతుకు రూ.5 వేలు చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం. గత ప్రభుత్వం రూ.12,500 ఇస్తామని రూ.7,500 ఇచ్చింది. మన ప్రభుత్వం దాన్ని రూ. 14,000 వేలకు పెంచింది. ఏది రైతు ప్రభుత్వమో, ఏది రైతు వ్యతిరేక ప్రభుత్వమో ప్రజలే నిర్ణయించుకోవాలి. అలాగే 90 శాతం సబ్సీడీతో డ్రిప్ ఇరిగేషన్ ఇస్తే గత ఐదేళ్లలో దాన్ని నిలిపేశారు. ఈనెల 15వ తేదీ నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం' అని సీఎం ప్రకటించారు.

# కానిస్టేబుల్ తుది పరీక్ష ఫలితాలు విడుదల

-మొదటిపేజీ తరువాయి

తృతీయ స్థానం సాధించినట్లు వెల్లడించారు. ఈ పోస్టులకు ఆన్‌లైన్‌లో 5,03,486 మంది దరఖాస్తు చేసుకోగా, 4,59,182 మంది ప్రిలిమినరీ రాత పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. వీరిలో 95,208 మంది అభ్యర్థులు శారీర సామర్థ్య పరీక్షలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. 13 కేంద్రాల్లో నిర్వహించిన శారీరక సామర్థ్య పరీక్షల్లో 38,914 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది జులై 10న నిర్వహించిన తుది రాత పరీక్షా ఫలితాల్లో 33,921 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు తెలిపారు. పోలీసు స్టేషన్లలో సిబ్బంది కొరత అధిగమించడానికి ఈ నియామకాలు దోహదం చేస్తాయన్నారు. ఎంపికైన 6,100 మంది అభ్యర్థులకు సెప్టెంబరు మొదటి వారం నుంచి ట్రైనింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. మిగిలిన ఖాళీలను



భర్తీ చేయడానికి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా www.slprb.ap. gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, వివిధ కేటగిరీలకు సంబంధించి కటాఫ్ మార్కుల వివరాలు పేర్కొన్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 94414-50639, 91002-033323 నెంబర్లను సంప్రదించాలని లేక slprb@ap.gov.in మెయిల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా, పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు ఛైర్మన్ ఆర్‌కె మీనా, అదనపు డిజిపి ఎన్ మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఫలితాలు ఇలా చెక్ చేసుకోండి.**

https://slprb.ap.gov.inవెబ్ సైట్ ఓపెన్ చేయాలి.
అందులో AP Police Constable Final Result 2025 లింకుపై క్లిక్ చేయాలి.
అది లాగిన్ పేజీలో మీ రోల్ నంబర్ రిజిస్ట్రేషన్ నంబర్ పుట్టిన తేదీ పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి.
మీ ఫలితాలు స్క్రీన్ పై కనిపిస్తాయి.

## లిక్కర్ స్కాంలో రోజుకో పిట్ట కథ'

-మొదటిపేజీ తరువాయి

ఏడాదిలోనే ఘోరంగా విఫలమైంది. ప్రజల తిరస్కరణకు గురైన కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతుంది. లిక్కర్ స్కాం పేరుతో ప్రజల దృష్టిని మరల్చాలని భావిస్తుంది. అడ్డగోలుగా కేసులు పెడుతున్నారు. స్కాం ఎక్కడో ఇప్పటికీ తెలియడం లేదు. లిక్కర్ స్కాం డబ్బులు గల్ఫ్ అంటారు.. ఆఫ్రికా అంటారు.. ఎన్నికల్లో ఖర్చు పెట్టారు అన్నారు. రోజూ ఏదో ఒక పిట్టకథ చెప్తున్నారు. లేని.. జరగని ఒక స్టోరీ చెప్పి అక్రమ కేసులు పెడుతున్నారు. లిక్కర్ స్కాం పేరుతో ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కేసుల పేరు చెప్పు ఇచ్చిన హామీల నుంచి తప్పించుకుంటున్నారు. ప్రజల్లోకి వైఎస్ జగన్ వెళ్లకుండా అడ్డుకోవడానికి ఏదో ఒక డైవర్షన్ చేస్తున్నారు ఏపీలో ఒక %జుజవీ% ఇద్దరు %ణజవీ% లు ఉన్నారు. ఇద్దరు %ణజవీ%లలో ఒకరు డిప్యూటీ సీఎం అయితే, మరొకరు డీఫ్యాక్టో సీఎం. వీరు ప్రజా సమస్యల గురించి పట్టించుకోవడం లేదు. లిక్కర్ కేసులో అరెస్టులు ఎందుకు చేస్తున్నారు.. స్కాం ఎక్కడ జరిగిందో చెప్పాలి కదా. లిక్కర్ స్కాంలో అసలు దొంగ చంద్రబాబే. 2019-2024 మధ్యం స్కాం జరగలేదు. 2014-2019 మధ్య జరిగింది అసలైన లిక్కర్ స్కాం. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి చంద్రబాబు గండి కొట్టారు.

లిక్కర్ స్కాంలో రోజుకో పిట్ట కథ చెప్తున్నారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తెచ్చిన లిక్కర్ పాలసీలో ప్రభుత్వ ఆదాయం పెరిగింది. కూటమి ప్రభుత్వం తెచ్చిన లిక్కర్ పాలసీలో ప్రభుత్వ ఆదాయం పెరిగిందా?. లిక్కర్ డోర్ డెలివరీ చేసి బలవంతం తాగించడం కోసం ప్రయత్నం చేస్తున్నారు. 11 కోట్లు సీజ్ చేశారు.. అవి ఎవరివి?. అతని స్టేట్మెంట్ ఏమైనా రికార్డ్ చేశారా?. కేసిరెడ్డి ఎన్నికల ముందు డబ్బు దాస్తే ఇంతకాలం అలాగే అక్కడే ఉంటుందా?. లిక్కర్ స్కాం జరగలేదు మిథున్ రెడ్డి ఎక్కడా ఇన్వాల్వ్ కాలేదు. నెల్లూరు ఏమైనా కంచుకోటా.. కంచె వేసి అడ్డుకోవడం ఏమిటి?. మెయిల్స్ చేసి అడ్డుకోవాల్సిన అవసరం మాకు లేదు. మీ మాదిరి దిగజారి వ్యవహరించాల్సిన అవసరం లేదు. చంద్రబాబు మేనేజ్ మెంట్ స్కిల్స్ ముందు మేం సరితూగం' అని కామెంట్స్ చేశారు.

## గుంటూరు జిల్లా అభివృద్ధిపై కేంద్రమంత్రి పెమ్మసాని స్పెషల్ ఫోకస్

-మొదటిపేజీ తరువాయి

ప్రతి మూడు నాలుగు వారాలకు సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. శంకర్ విలాస్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. శంకర్ విలాస్ బ్రిడ్జి పనుల్లో నష్టపోయిన 74 మందికి నష్టపరిహారం అందించామని గుర్తుచేశారు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్. ఎనిమిది నెలల్లో నంది వెలుగు బ్రిడ్జి పూర్తి చేస్తామని సంబంధిత పనుల కాంట్రాక్టర్ చెప్పారని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. సెప్టెంబర్‌లో ఇన్నర్ రింగ్ రోడ్డు థర్డ్ ఫేజ్ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పీవీకే నాయుడు మార్కెట్ స్థానంలో రూపొందించిన డిజైన్ నచ్చలేదని చెప్పారు. ఆ డిజైన్ మార్చాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. గుంటూరు నగరంలో శానిటేషన్ బాగా ఇంప్రూవ్ అయిందని తెలిపారు. నగర సుందరీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఉద్ఘాటించారు. మూడు వంతెనల వద్ద నీరు నిల్వకుండా చేయాలంటే 200 ఆక్రమణలను తొలగించాల్సి ఉంటుందని చెప్పారు. దీర్ఘకాలిక ప్రక్రియలో భాగంగా ఆక్రమణలను తొలగిస్తామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

**బీసీల ఆత్మగౌరవం నిలబెట్టడానికే తమ ప్రభుత్వం పనిచేస్తోంది: ఎమ్మెల్యే ధూళిపాళ్ల**

ఏపీ అభివృద్ధికి విరాళం ప్రకటించిన దాతల సహకారం అభినందనీయమని తెలుగుదేశం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. బీసీల ఆత్మగౌరవం నిలబెట్టడానికే తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. ఈ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను కేంద్ర మంత్రి పెమ్మసాని ద్వారా పరిష్కరించడం అభినందనీయమని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రశంసించారు.

## నో బిజినెస్ అంటున్న వేమిరెడ్డి

**నెల్లూరు :** ఆయన నాన్ కాంట్రవర్సీ లీడర్. మంచి బిజినెస్ మెన్ కూడా. 2018 వరకూ ఆయనకు ఎలాంటి రాజకీయ వాసనలు లేవు. అందరి వారిగా ఉంటూ వచ్చిన వారు. కానీ ఆల్ ఆఫ్ సడెన్‌గా 2019లో వైసీపీ నుంచి ఎంపీ అయ్యారు. ఆ తర్వాత జగన్‌తో విబేధించి టీడీపీ గూటికి చేరి 2024లోనూ ఎంపీగా గెలిచారు. ఒకప్పుడు వైసీపీలో ఆయన ప్రత్యర్థులుగా ఉన్నవారు..ఇప్పుడు వేమిరెడ్డి టీడీపీ ఉండటంతో డైరెక్ట్ అటాక్‌కు దిగుతూ అలిగేషన్స్ చేస్తున్నారు ఎంపీ గారు నొచ్చుకుంటున్నారు. నెల్లూరు జిల్లాలో అంగబలం, అర్ధబలం రెండూ జతకలసి టీడీపీకి అంది వచ్చిన అస్త్రంగా మారిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసీపీకి టార్గెట్ అయ్యారు. వైసీపీలో ఒకనాటి ప్రత్యర్థులంతా ఇప్పుడు ఆయనకు ఎదురు నిలిచి సవాల్ చేస్తుండటంతో ఎందుకొచ్చిన తలనొప్పి అంటూ ఎంపీగారు..పెద్ద డెసిషనే తీసుకున్నారట.అలిగేషన్స్ ఎక్కువైపోవడంతో నెల్లూరు టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. 400 కోట్ల రూపాయలతో ఫ్యాక్టరీ పెట్టాలనుకున్న ఆలోచనను విరమించుకున్నట్లు ప్రకటించారు. 400 కోట్ల రూపాయల పెట్టుబడితో క్వార్ట్జ్ ఫ్యాక్టరీ పెట్టి వెయ్యి మందికి ఉపాధి కల్పించాలని అనుకున్నానని, ప్రభుత్వాన్ని అనుమతులు అడిగానని చెప్పుకొచ్చారు. అక్రమ మైనింగ్ లేకుండా న్యాయబద్ధంగా క్వార్ట్జ్ పరిశ్రమ నెలకొల్పాలని అనుకున్నట్లు చెప్తున్నారు.సొంత డబ్బుతో సేవ చేస్తుంటే తనపైనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన వాపోయారు. తనకు అవినీతి చేయాల్సిన అవసరం లేదంటున్న ఆయన..ఎవరన్నా ఆసక్తి ఉన్న వాళ్ళు ఫ్యాక్టరీ పెట్టాలని వస్తే వారికి సహకరిస్తానంటున్నారు. అంతేకాదు క్వార్ట్జ్ అంశంలోకి తనను లాగితే వాళ్ళ ఖర్మకి వదిలేస్తున్నా అని స్టేట్‌మెంట్ ఇచ్చేశారు. మాటలు పడలేకే క్వార్ట్జ్ బిజినెస్‌ను ఆపేస్తున్నట్లు ప్రకటించేశారు. వేమిరెడ్డి ఒక్కసారి గరం గరమై..నో బిజినెస్ అంటూ చేసిన వ్యాఖ్యలు సెన్సేషన్ అవుతున్నాయి. ఆయన స్వపక్షంలోని ఎదుటి పక్షంలోని ప్రత్యర్థులు అందరికీ ఒకే మాటతో జవాబు చెప్పారా అన్న చర్చ సాగుతోంది

## భారత్‌లో ఒక చిన్న వ్యాపారి కూడా ట్రంప్‌కు ఆర్థిక పాఠాలు నేర్పించగలడు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై మాజీ ప్రధాని, జేడీ(ఎస్) నేత హెచ్‌డీ దేవెగౌడ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించిన ఆయన, ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరించిన వైఖరిని మనస్ఫూర్తిగా అభినందించారు. ట్రంప్ బెదిరింపులకు మోదీ సర్కార్ లొంగకుండా దేశ ప్రయోజనాలను కాపాడిందని ప్రశంసించారు. దేవెగౌడ రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, జాతీయ ప్రయోజనాల విషయంలో ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో దేవెగౌడ తన అభిప్రాయాలను వెల్లడించారు. "భారత ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యమైపోయిందంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన ఆధారరహిత, దురుసు వ్యాఖ్యలు నన్ను ఆశ్చర్యపరిచాయి. ఆయనో అస్థిరమైన, అనాగరికమైన, బాధ్యతారహితమైన నేత. మన దేశంలో గౌరవంగా, నిజాయతీతో వ్యాపారం చేసుకునే ఓ చిన్న వ్యాపారి, ఓ పేద రైతు కూడా ట్రంప్‌కు ఎన్నో ఆర్థిక పాఠాలు నేర్పగలరు" అని దేవెగౌడ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశ ప్రయోజనాల విషయంలో ఏమాత్రం రాజీ పడలేదని దేవెగౌడ స్పష్టం చేశారు. "ట్రంప్ బెదిరింపులకు భయపడకుండా, దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టారు. దేశ జనాభాలో సగానికి పైగా ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను కాపాడేందుకు మోదీ ప్రభుత్వం తీసుకున్న దృఢమైన వైఖరి అభినందనీయం. ఈ నిర్ణయం దేశ పునరుజ్జీవనానికి దారి తీస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని, అలాంటిది దానిని 'చచ్చిపోయిన ఆర్థిక వ్యవస్థ'గా అభివర్ణించడం చూస్తుంటే ట్రంప్‌కు కళ్లు కనపడటం లేదో లేక సమాచార లోపమో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో, ట్రంప్ వ్యాఖ్యలను సమర్థిస్తున్న కొందరు ప్రతిపక్ష నేతల తీరుపై కూడా దేవెగౌడ మండిపడ్డారు. వారి నిరాశను అర్థం చేసుకోగలనని, కానీ ఇలాంటి పనులు చేస్తూ తమను, తమ పార్టీలను నాశనం చేసుకుని, ట్రంప్‌తో పాటు చరిత్ర చెత్తబుట్టలో కలిసిపోవద్దని ఆయన హితవు పలికారు.

## రాహుల్ గాంధీ చిన్న పిల్లవాడేమీ కాదు

భారత ఆర్థిక వ్యవస్థపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన 'డెడ్ ఎకానమీ' (నిర్జీవ ఆర్థిక వ్యవస్థ) వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమర్థించడం రాజకీయ దుమారానికి దారితీసింది. ఈ వ్యాఖ్యలపై అధికార బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతుండగా, మరోవైపు సొంత పార్టీ సీనియర్ నేతల నుంచే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో పడేసింది. ఈ పరిణామం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదంపై కాంగ్రెస్ సీనియర్ నేతలు శశి థరూర్, రాజీవ్ శుక్లా స్పందిస్తూ.. రాహుల్ గాంధీ అభిప్రాయంతో తాము ఏకీభవించడం లేదని స్పష్టం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ బలహీనంగా లేదని, ట్రంప్ చేసిన వ్యాఖ్యలు వాస్తవదూరమని వారు పేర్కొన్నారు. సొంత పార్టీ నేతలే రాహుల్ వైఖరిని బహిరంగంగా తప్పుపట్టడం ఈ వివాదానికి కొత్త కోణాన్ని ఇచ్చింది. ఈ అవకాశాన్ని బీజేపీ బలంగా వాడుకుంటోంది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "రాహుల్ గాంధీ చిన్నపిల్లవాడేమీ కాదు. ప్రతిపక్ష నేతగా దేశ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. కానీ ఆయన దేశానికి వ్యతిరేకంగా ప్రమాదకరమైన ఆట ఆడుతున్నారు" అని రిజిజు విమర్శించారు. రాహుల్ చేస్తున్న వ్యాఖ్యలను ఆయన పార్టీలోని సీనియర్లే వ్యతిరేకిస్తున్నారని గుర్తుచేశారు. మరోవైపు, బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ మరింత ఘాటుగా స్పందించారు. "దేశ ఆర్థిక వ్యవస్థ చచ్చిపోలేదు, రాహుల్ గాంధీ విశ్వసనీయత మాత్రమే చచ్చిపోయింది" అంటూ ఎద్దేవా చేశారు. రాహుల్ వ్యాఖ్యలు నిరాధారమైనవని ఆయన కొట్టిపారేశారు. ఈ వివాదం పార్లమెంటును సైతం కుదిపేసింది. తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ, "భారత ఆర్థిక వ్యవస్థ చచ్చిపోయిందన్న విషయం ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు తప్ప దేశంలో అందరికీ తెలుసు" అని రాహుల్ పేర్కొన్నారు. దీనిపై బీజేపీ ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో సభలో గందరగోళం చెలరేగింది.

## భారతీయులకు 10 లక్షల ఉద్యోగాలు.. మాతో కలవండి:

భారతీయులకు 10 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పిస్తామంటూ పాకిస్థాన్ లోని బలూచిస్థాన్ నుంచి ఓ కీలక ప్రతిపాదన వచ్చింది. బలూచిస్థాన్ ను ఓ దేశంగా పేర్కొంటూ, తమ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుతూ ప్రముఖ బలూచ్ మానవ హక్కుల పరిరక్షకుడు మీర్ యార్ బలూచ్, భారత ప్రభుత్వ, ప్రైవేట్ రంగ కంపెనీలకు శుక్రవారం ఓ లేఖ రాశారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజాస్వామ్య దేశంగా, సాంకేతిక శక్తిగా ఉన్న భారత్.. బలూచిస్థాన్ అభివృద్ధికి అత్యంత సహజమైన, నమ్మకమైన భాగస్వామి అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. దక్షిణాసియా, మధ్యప్రాచ్యం, మధ్య ఆసియా కూడలిలో ఉన్న బలూచిస్థాన్.. భౌగోళికంగా, ఆర్థికంగా అత్యంత కీలకమైన ప్రాంతమని మీర్ యార్ తెలిపారు. అరేబియా సముద్రం వెంబడి 1,000 కిలోమీటర్లకు పైగా తీరప్రాంతం, కీలకమైన సముద్ర వాణిజ్య మార్గాలకు దగ్గరగా ఉండటం వల్ల ఇది మధ్య ఆసియా, ఐరోపా, మధ్యప్రాచ్యానికి సహజమైన ముఖద్వారంగా ఉందని వివరించారు. ఈ ప్రాంతంలో ట్రిలియన్ల డాలర్ల విలువైన అరుదైన ఖనిజాలు, బంగారం, రాగి, చమురు, బొగ్గు, లిథియం, సహజ వాయువు నిక్షేపాలు ఉన్నాయని గుర్తుచేశారు. అపారమైన సంపద ఉన్నప్పటికీ, దశాబ్దాల దోపిడీ, ఆక్రమణల కారణంగా తమ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛా, సార్వభౌమ బలూచిస్థాన్ గణతంత్రం సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తోందని, వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ఆర్థిక పరివర్తన తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఒక కొత్త దేశాన్ని నిర్మించే ఈ అద్భుత అవకాశంలో భారత నిపుణులు పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. తమ దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 30కి పైగా కీలక రంగాల్లో భారత నిపుణులకు 10 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మీర్ యార్ బలూచ్ వెల్లడించారు. ఆటోమొబైల్ రంగంలో 40,000, ఏరోస్పేస్‌లో 10,000, రైల్వేలు, రైళ్ల తయారీలో 20,500, పునరుత్పాదక ఇంధన రంగంలో 60,000 ఉద్యోగాలు ఉంటాయని ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా భారత్‌కు కేవలం వాణిజ్య ప్రయోజనాలే కాకుండా వ్యూహాత్మక భద్రత, ఇంధన భద్రతతో పాటు శాంతి కూడా లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఏపీలో కక్ష సాధింపు సంస్కృతి తెచ్చిందే జగన్

**అమరావతి:** జగన్‌పై భాజపా ఎంపీ సీఎం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుది జగన్ లాంటి కక్ష సాధింపు వ్యక్తిత్వం కాదని అన్నారు. ఏపీలో కక్ష సాధింపు సంస్కృతి తెచ్చిందే జగన్ అని విమర్శించారు. వైకాపా కక్ష సాధింపు జాబితా పంపుతానని, జగన్ చదువుకోవాలని ఎద్దేవా చేశారు. "చంద్రబాబు సంయమనం వల్లే జగన్ ఇంకా రోడ్లపై తిరుగుతున్నారు. పెద్దిరెడ్డిపై సీఎంకు కక్షసాధింపు ఉంటే ఎప్పుడో చర్యలుండేవి. ఆయన కేవలం రాష్ట్రం మంచి కోసమే ఆలోచిస్తున్నారు. జగన్ రాకముందు రాష్ట్రంలో కక్షసాధింపులు లేవు. వైకాపా పాలనలో కూటమి నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టారు. చంద్రబాబు, పవన్‌ను బయటకు రాకుండా అడ్డుకున్నారు. వైకాపా నాయకులు స్వేచ్ఛగా తిరుగుతున్నారంటే సీఎం పిలుపే కారణం. వైకాపా హయాంలో జరిగిన ప్రతి అవినీతిపై సీఎం చంద్రబాబు విచారణ జరిపించాలి. రాష్ట్రంలో పోలీసు సిబ్బంది సరిపోకపోతే సీబీఐ, ఈడీ సహకారం కోరతాం. జగన్ అవినీతి కేసుల విచారణ వేగవంతానికి కృషి చేస్తాం. పులివెందుల జడ్పీటీసీ ఎన్నిక జరగబోతోంది. బీటెక్ రవి భార్య పోటీ చేస్తున్నారు.. తప్పకుండా ఆమె గెలుస్తారు. వైకాపా మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. రాష్ట్రం అభివృద్ధి చెందడం జగన్‌కు ఇష్టం లేదు. కేవలం ఆయన కుటుంబం అభివృద్ధి చెందితే చాలు" అని సీఎం రమేశ్ అన్నారు.

తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

# ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం పదిలం





## చిత్తూరు డిఎఫ్ఓ భరణి సూచన

## ఆరోగ్యమే మహాభాగ్యం

చిత్తూరు, స్వర్ణ సాగరం,ఆగస్టు 1

ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని చిత్తూరు డిఎఫ్ఓ ఎస్ భరణి సూచించారు. చిత్తూరు నగరం కట్టమంచి ఆర్ఆర్ రెసిడెన్సి పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన మయుక ఆర్గానిక్ నేచురల్ ప్రొడక్ట్స్ విక్రయ దుకాణాన్ని శుక్రవారం ఉదయం డిఎఫ్ఓ భరణి ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ .... ప్రస్తుతం రసాయనిక ఎరువులను భారీ ఎత్తున వినియోగిస్తుండంటంతో మానవులతో పాటు, ఇతర జీవరాసులు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి సేద్యాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులందరూ రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా తమ పంట పొలాలకు విరివిగా ఆర్గానిక్ ఎరువులను వాడాలని సూచించారు. ప్రజలు సైతం ఆర్గానిక్ ఉత్పత్తుల వినియోగంపై మొగ్గు చూపాలని కోరారు. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తువులు కొర్రలు, అండుకొర్రలు, సజ్జలు, రాగులు, జొన్నలు ఇతర చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిత్తూరు నగరంలో మయుక స్టోర్స్ యాజమాన్యం విక్రయిస్తున్న చిరుధాన్యాలు, ఇతర ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేసి అటు ప్రకృతి సేద్యానికి, ఇటు సేంద్రీయ ఉత్పత్తుల విక్రయదారులకు ఊతం ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం బంగారుపాళ్యం మండలం జంబువారిపల్లికి చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయదారుడు, ప్రాణహిత ఆర్గానిక్ ప్రొడక్ట్స్ అధినేత యనమల జగదీష్ కుమార్ రెడ్డి ప్రకృతి వ్యవసాయంచే పండించిన చిరుధాన్యాల వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కాగా ఈ కార్యక్రమంలో మయుక ఆర్గానిక్స్ అండ్ నేచురల్ ప్రొడక్ట్స్ నిర్వాహకులు కె శ్యామ్ కుమార్ రెడ్డి, కే మంజువాణితో పాటు పెద్ద ఎత్తున వినియోగదారులు పాల్గొన్నారు.

# అబాషన్స్ కేసులు అన్నింటిని వెరిఫై చేసి వాటి యొక్క కారణాలను నివేదిక ఇవ్వాలి

## :జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్


## ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణీలకు సుఖ ప్రసవాల జరగాలి

చిత్తూరు,స్వర్ణ సాగరం, ఆగస్టు 01



అబాషన్స్ కేసులు అన్నింటిని వెరిఫై చేసి వాటి యొక్క కారణాలను నివేదిక రూపంలో కలెక్టర్ కు అందజేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖఅధికారులను, డాక్టర్లను,జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరం నందు పిసి అండ్ పిఎన్ డిటి చట్టం కింద జిల్లా స్థాయి బహుళ సభ్యుల అప్రూవింగ్ అథారిటీ మరియు సలహాల పై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కమిటీ అధ్యక్షత హెూదాలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగాజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వాసుపత్రులలో ఎక్కువశాతం కాన్పులుజరగాలి. ప్రాథమికఆరోగ్యకేంద్రాలలోకూడాగర్భిణీలకుసుఖప్రసవాల జరగాలి. శస్త్ర చికిత్సలు ఎక్కువగా జరగకుండా చూడవలసిన బాధ్యత డాక్టర్లపై ఉన్నదని తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సుఖప్రసవాలునెలకు 50నిర్వహించాలనితెలిపారు.ముఖ్యంగా జిల్లాలో జరిగే అబార్షన్స్ ప్రైవేట్ మరియు గవర్నమెంట్ నందు జరిగే వాటిని ఏఎన్ఎం, ఆశ వారిగాప్రోగ్రాంఅధికారులతో ప్రతి కేసును ప్రశ్నావళితో వెరిఫై చేసి రిపోర్ట్ సబ్మిట్ చేయాలన్నారు. ఆర్ఎంపి డాక్టర్లు చట్ట నిబంధనల ప్రకారం గుర్తింపు లేనిచో అట్టి వాటినిమూసివేసేలాచర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రోగ్రాం అధికారులను నియమించి అబాషన్స్ కేసులు అన్నింటిని వెరిఫై చేసి వాటి యొక్క కారణాలను నివేదిక ద్వారా తెలుపాలన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు వైద్య సిబ్బందితో కలసి పిహెచ్ సి పరిధిలో జరిగే అబార్షన్ పై నిఘ ఉంచి నివేదిక సమర్పించాలని తెలిపారు.జిల్లాలో పిసి%పిఎన్.డిటి చట్టమును పటిష్టంగా అమలు చేయుట కొరకు న్యాయ శాఖ, పోలీసు శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖసమన్వయంతోపనిచేయాలని ఆదేశించారు. చిత్తూరు జిల్లాలో పిసి%పిఎన్.డిటి చట్టంను పటిష్టంగా అమలు చేయాలని, ఎవరైన చట్ట విరుద్ధమైన కార్య కలాపాలైన లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు పాల్పడిన వారు చట్టపరమైన, న్యాయపరమైన శిక్షలు అమలు చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పిసి%పిఎన్.డిటి చట్టంపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి ప్రజలకు చట్టంలోని శిక్షలు, జరిమానాల గురించి తెలియజేయాలని తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుచున్న, ప్రోత్సహిస్తున్న వారి వివరములను సంబంధిత అధికారులకు తెలియజేయాలని, అట్టి వారి వివరములను గోప్యంగా ఉంచాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.పిసి అండ్ పిఎన్ డిటి చట్టంను ఖచ్చితంగా అమలు చేసి జిల్లాలో లింగ నిష్పత్తిని సమాన స్థాయికి తీసుకొచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి బృందాల ద్వారా మరియు డివిజినల్ స్థాయి బృందాల ద్వారా ప్రతి నెల తనిఖీలు చేయాలన్నారు. జిల్లాలో ఏ ప్రాంతాల యందు భ్రూణ హత్యలు ఎక్కువ జరుగుచున్నవో అబార్షన్ లీస్ట్ ద్వారా ఆశా, ఏఎన్ఎం , ఏ డబ్ల్యు డబ్ల్యు , మహిళా పోలిసు కార్యదర్శి, ఎన్జీవో లు మరియు సచివాలయ సిబ్బంది ద్వారా గుర్తించి, అందుకు గల కారణాలను తెలుసుకొని లింగ నిర్ధరాణకు పాల్పడుచున్న వారిపై ఎవరైన సరే పిర్యాదు చేయవచ్చని, అట్టివారి వివరములు గోప్యంగా ఉంచబడునని, చట్టవ్యతిరేఖ కార్యకలా పాలకు పాల్పడుచున్న వారిపై వెంటనే చర్యలు తీసుకొనబడునని తెలిపారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాల వారు ఎవరైన గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు పాల్పడుచున్న వారి పై పిసి%డ%పిఎన్ డిటి చట్టం సెక్షన్ 23, 24, 25 క్రింద కేసు నమోదు చేసి జరిమానాలు విధించి, శిక్షలు అమలు చేయాలని కమిటి సభ్యులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సుధారాణి, ఉపవైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.వెంకటప్రసాద్, డిసిహెచ్ఎస్డా. పద్మాంజలి, పిసిపిఎన్ డిటి ఇంచార్జ్ నోడల్ అధికారి డాక్టర్ అనిల్ కుమార్, దిశ సీఐ.మహేశ్వర్, డా.ఉషశ్రీ ,డా.లత, డా. ప్రశాంత్, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరి, సుబ్రమణ్యం, ఎన్జీవోశేషాద్రి, రమా దేవి,రామారావు,లీగల్ కన్సల్టెంట్ ఇంద్రాణి, డెమో జయరాముడు, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే,,, ఆదివారం డక్కిలిలో ఉచిత వైద్య శిబిరం




స్వర్ణ సాగరం ప్రతినిధి డక్కిలి

తిరుపతి జిల్లా డక్కిలి మండలం డక్కిలి గ్రామం నందు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పక్కన నీరజ్ ప్రధమ చికిత్స కేంద్రం వద్ద తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే డక్కిలిలో డా"ఎం వెంకటరమణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం 03-08-2025 ఆదివారం జరుగునున్నది. ఆర్తో, యూరాలజీ ,నెఫ్రాలజీ, జ్వరం ,టైఫాయిడ్, చెవి ,ముక్కు, గొంతు వ్యాధులకు మరియు స్త్రీలకు సంబంధించి అనారోగ్య సమస్యలకు ఉచితంగా చూడబడును,అదేవిధంగా ఉచితంగా మందులు పంపిణీ,మేజర్ ఆరోగ్య సమస్యలు ఉంటే వారు ఆరోగ్యశ్రీ కార్డు,ఆధార్ కార్డు, తీసుకుని వస్తే,వారిని తిరుపతికి ఉచితంగా వాహనంలో తీసుకువెళ్లి ఆరోగ్యపరీక్షలు చేసి,అవసరమైతే ఆపరేషన్ కూడా ఉచితంగా చేసి,భోజనం సదుపాయాలు ఏర్పాటు చేసి,తిరిగి చార్జీలు ఇచ్చి ఇంటికి పంపించే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ఓపి చూడబడు సమయం ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పూర్తి వివరాల కొరకు సంప్రదించవలసిన నెంబర్ 9390287590.ఈ అవకాశాన్ని డక్కిలి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డా"ఎం వెంకటరమణ కోరారు

# కెనమాకులపల్లి గ్రామంలో కొత్త పెన్షన్ల పంపిణీ



## అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందాలన్నది సీఎం లక్ష్యం

## టిడిపిమండల అధ్యక్షుడు విశ్వనాథ్ నాయుడు

శాంతిపురం స్వర్ణసాగరం న్యూస్



శాంతిపురం మండలంలోని కెనమాకులపల్లిపంచాయతీ కెనమాకులపల్లి గ్రామంలో ఎంపీడీవో ప్రేమ్ కుమార్ అధ్యక్షతన టిడిపి మండలనాయకుల సమక్షంలోకొత్తగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథ్ నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందాలనే దృఢ సంకల్పంతో సీఎం పనిచేస్తున్నారని సీఎం ఆదేశాల మేరకు మేము కూడాఆయన అడుగుజాడల్లోనే నడుస్తూ మండలంలోని అన్నిగ్రామాల వెంట తిరుగుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ స్వాతి సచివాలయ సిబ్బంది టిడిపి నాయకులు ఉదయ్ కుమార్ నాయుడు నాగరాజు జయరాం రెడ్డి రాధాకృష్ణ ఈ రమేష్ శివ గ్రామస్తులు పెన్షన్ దారులు పాల్గొన్నారు

# సింహపురి వైద్య సేవా సమితి జయభారత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



తోటపల్లి గూడూరు ఆగస్టు 1

మండలంలోని నరుకూరు గిరిజన కాలనీలో శుక్రవారం సింహపురి వైద్య సేవా సమితి జయభారత్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన చికిత్సలు జరిపి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. గిరిజనులకు హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జయ భారత్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ గురు ప్రసాద్ స్థానిక నేత అన్నం శ్రీనివాసులు ఎంపీటీసీ కొణతం రఘుబాబు సూరిబాబు వార్డు సభ్యురాలు కల్పన నా వూరు వెంకయ్య యానాదుల హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు పాల్గొన్నారు

# నెల్లూరు మోహన్ రెడ్డి చేతుల మీదుగా జీవిత భాగస్వామి పింఛన్లు పంపిణీ






కోట స్వర్ణసాగరం ఆగస్టు 1

రాష్ట్ర వ్యాప్తంగా జీవిత భాగస్వామి పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసింది.ఇందులో భాగంగా కోట మండలం కొత్తపాలెం పంచాయతీ పరిధిలో అర్హులైన 10 మంది వితంతువులకు క్రొత్తగా పింఛన్లు మంజురయ్యాయి.సదరు పింఛన్లను సచివాలయం సిబ్బంది,టిడిపి నాయకులు నెల్లూరు మోహన్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈసందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా తప్పక అమలు చేస్తుందని తెలిపారు.ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసిన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకం,తల్లికి వందనం పథకం సూపర్ సక్సస్ అయ్యాయని తెలిపారు.ఈనెల రైతులకు అమలు చేయబోయే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు.కూటమి ప్రభుత్వంలో గూడూరు శాసనసభ్యులు సునీల్ కుమార్ సహకారంతో గ్రామంలో మరెన్నో అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యానాటి. నారాయణ,గ్రామపార్టీ అధ్యక్షులు ముంగర.మురళి రెడ్డి,ప్రధాన కార్యదర్శి మట్టిగుంట సురేంద్రబాబు,బూత్ కన్వీనర్లు చేవూరు కోటేశ్వర రావు,గుండాల సుబ్రమణ్యం,కందల రాధాకృష్ణారెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి,చిట్టమూరు వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈదూరుగ్రామంలో పింఛన్లు పంపిణీ చేసిన టిడిపి నేత బాబు నాయుడు

తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం ఆగస్టు 1



మండలంలోని ఈదూరుగ్రామంలో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా కోడూరు సాగునీటి సంఘం అధ్యక్షులు స్థానిక టిడిపి నేత ఆర్ బాబు నాయుడు పంపిణీచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారాప్రతినెల మొదటితేదీన పింఛన్లు పంపిణీ చేయడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు అమలుపరచడంలోచిత్తశుద్ధితో పనిచేయడం అభినందనీయమన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం అమలవుతుందన్నారు

# బదిలీ అయిన కోడూరు హెచ్‌ఎం కు సన్మానం



**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 1**

మండలం లోనికోడూరు ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో హెచ్ఎం గా పనిచేస్తూ బదిలీలలో భాగంగ ఇందుకూరుపేట మండలం గంగపట్నం పాఠశాలకు బదిలీ అయిన వి సుజాతను పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించి అభినందించారు. హెచ్ఎం భారతి అధ్యక్షత వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు హాజరత్ వ్యాఖ్యతగా కార్యక్రమాన్ని నడిపించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తమ తమ సందేశాలలో సుజాత పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని నాడు నేడు ద్వారా పాఠశాలలో నూతన హంగులు కల్పించిన విశేషాలను వివరించారు చెన్నపల్లి పాలెం హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఆత్మకూరు ఠాగూర్ మాట్లాడుతూ హెచ్ ఎం సుజాత పిల్లలను సక్రమంగా పాఠశాలకు తీసుకురావడంతోపాటు క్రమశిక్షణ నేర్పి విద్యా వ్యాప్తికి కృషి చేసిందన్నారు. సన్మాన గ్రహీతలు సుజాత ప్రసాద్ దంపతులు తమ సందేశాలలో తోటి ఉపాధ్యాయులు అధికారులు గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రుల సంపూర్ణ సహకారంతో తాను పనిచేసినట్లు పేర్కొన్నారు. హెచ్ఎం బదిలీ జీర్ణించుకోలేని విద్యార్థులు తల్లిదండ్రులు కన్నీళ్ల పర్యంతమైనారు.సీనియర్ జర్నలిస్ట్ వి మాధవరావు ఆలపించిన గేయం"బదిలీపై వెళ్లావు" "బడిని బాగా దిద్దావు" సభికులను ఆకట్టుకుంది . ఈ ఆత్మీయ సమావేశంలో హెచ్ఎం భారతిసహ ఉపాధ్యాయులు హజరత్ మాధవి లక్ష్మి మహాలక్ష్మి సునీత విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నరుకూరులో స్పౌస్ పింఛన్లు పంపిణీ



**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 1**

మండలంలోని నరుకూరులో శుక్రవారంసర్వేపల్లి శాసనసభ్యులుసోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నరుకూరు గ్రామ పంచాయితీలో కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లు స్థానిక నేతలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ అన్నం శ్రీనివాసులు, ఎంపీటీసీ కొణతం రఘుబాబు, సెక్రెటరీ ప్రవల్లిక, మాజీ ఎంపీటీసీ పాకం వెంకయ్య, యూనిట్ ఇంచార్జి అరికాటి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు నక్క సూరిబాబు, నావూరు రాధాయ్య, సాడేపల్లి రవణయ్య మరియు సచివాలయం సిబ్బందిపాల్గొన్నారు.

# APSRTC ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం గారి ఆధ్వర్యంలో NTR భరోసా పింఛన్ల పంపిణి పండుగ కార్యక్రమం.

**కుప్పం స్వర్ణసాగరం న్యూస్**





రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈరోజు అనగా 1-08-2025 తేదిన కుప్పం నియోజకవర్గ గుడిపల్లి మండలం శెట్టిపల్లి పంచాయతీ చిన్న శెట్టిపల్లి గ్రామం లో లబ్ధిదారులకి NTR భరోసా పింఛన్ల పంపిణి చేసి స్థానికంగా ఉన్న ప్రజల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకొని. కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చిన ప్రజాప్రతి నిధులు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న AP SRTC ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం గారు మాజీ ఎంపీపీ రాజు గారు పంచాయతీ పార్టీ అధ్యక్షులు యూనిట్ ఇంచార్జ్ మధు గారు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు .

# పల్లిపాడు లో తల్లిపాల వారోత్సవాలు

## గర్భవతులకు సీమంతాలు

**ఇందుకూరుపేట స్వర్ణ సాగరం ఆగస్టు 1**



మండలం లోనిపల్లెపాడు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు . గర్భవతులకు సీమంతాలు జరిపారు .తల్లిపాల వారోత్సవాలు వాటి ప్రాధాన్యత బాలింతలు గర్భవతులు తీసుకోవలసిన జాగ్రత్తలు పోషక ఆహార విలువలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ సి డి పి ఓ ఎం రాజ్యలక్ష్మి సూపర్వైజర్ ఎం శిరీష హెచ్ఎం జిలాని భాష అంగన్వాడీ సిబ్బంది సునీత మస్తానమ్మ గర్భవతులు బాలింతలు పాల్గొన్నారు

# శ్రీసిటీని సందర్శించిన 'అక్షరధాం' ఆధ్యాత్మిక గురువులు








**శ్రీసిటీ,స్వర్ణ సాగరం ఆగస్టు 01, 2025:**

ఢిల్లీలోని ప్రముఖ అక్షరధాం స్వామినారాయణ్ ఆలయానికి చెందిన ఆధ్యాత్మిక గురువులు అక్షర్ ప్రేమ్, వినమ్రవదన్ లు శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. వీరికి సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వారికి వివరించారు. ప్రత్యేకించి శ్రీసిటీ పేరుకున్న ఆధ్యాత్మిక ప్రాధాన్యత గురించి హైలైట్ చేశారు. పర్యటనలో భాగంగా పారిశ్రామికవాడ పరిసరాలతో పాటు స్థానిక శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన శ్రీసిటీ ఉద్యానవనాన్ని స్వామీజీలు సందర్శించారు. అక్కడనుంచి డైకిన్ ఏసీ పరిశ్రమకు వెళ్లి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. పచ్చదనం, పర్యావరణం, ఆధ్యాత్మికకు పెద్దవేట వేస్తూ ముందుకు సాగుతున్న శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని ప్రశంసించిన స్వామీజీలు, శ్రీసిటీ ఎండీని అభినందిస్తూ ఆశీర్వచనాలు అందచేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా ప్రపంచ ఖ్యాతి కలిగిన అక్షరధాం ఆధ్యాత్మిక గురువులు శ్రీసిటీ సందర్శించడం తమకు దక్కిన అదృష్టం, గౌరవంగా భావిస్తున్నట్లు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. వీరి పర్యటనతో ఈ ప్రాంతం మరింత ఆధ్యాత్మిక ప్రాధాన్యతను పొందుతుం దన్నారు. దక్షణ భారతదేశంలో శ్రీసిటీ కేంద్రంగా స్వామినారాయణ్ ఆలయ నిర్మాణాన్ని చేపట్టాలని ఈ సందర్భంగా వారికి విజ్ఞప్తి చేశారు.

# చిన్న చెరుకూరు అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 1**

గమండలం లోనిచిన్నచెరుకూరు అంగన్వాడీ కేంద్రం లో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలు కారిక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు సెక్టార్ సూపర్ వైజర్ ఎం. లలితాంబ పాల్గొన్నారు.. గ్రామం లో గర్భవతులు, బాలింతలు తల్లులకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు రక్తహీనత లేకుండా ఉండాలంటేమంచి ఆహారం తీసుకోవా లని తెలిపారు, కేవలం 6నెలలు తల్లి పాలే ఇవ్వాలన్నారు, తల్లి మొదట ఇచ్చే ముర్రు పాలే బిడ్డ కు మొదటి టీకా,. పుట్టిన గంటలోపల తల్లిపాలు తాగించాలన్నారు. తల్లిపాలు సులువుగా జిర్ణం అవుతాయన్నారు, తల్లి పాలు ఇవ్వడం వల్ల తల్లి కి బిడ్డ కు ఆరోగ్యం అని తెలిపారు.

# అర్హులైన లబ్దిదారులకు పెన్షన్ల మంజూరు చేయాలి





## కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

**కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 01**

అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన పెన్షన్లు మంజూరు చేయాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ కోరారు.శుక్రవారం కనిగిరి పట్టణంలోని బొగ్గుల గొంది కాలనీలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులతో కలసి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది.అనంతరం పెన్షన్స్ పంపిణి చేయు విధానమును వార్డులో పరిశీలించగా గత సంవత్సర కాలం నుండి వికలాంగుల సర్టిఫికెట్ పొంది పెంక్షన్ దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగిన ఫలితం లేకపోయిందని ఆ పెంక్షన్ ద్వారా జీవనధారమణి లభిద్దారుడు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు నూతనంగా పెంక్షన్స్ కూడా ఇవ్వకపోవడం చాలా భారకరమన్నారు.అవ్వ తాతలు లబ్ధిదారులు అర్హత కలిగి పెన్షన్స్ పొందలేక జీవనధారము చాలా కష్ట తరంగా ఉందవి వాటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నూతన పెన్షన్స్ పొందుటకు జాప్యం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెంక్షన్స్ చూడాలని ఆయన కొనియాడారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ఆనంద వ్యక్తం చేసిన అవ్వ తాతలు



**కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 01**

తెల్లవారుజాము నుండి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పొందడం ద్వారా అవ్వ తాతలు ఆనంద వ్యక్తం చేశారు.హనుమంతునిపాడు మండలం హాజీపురంలో తెల్లవారుజాము నుండి అవ్వ తాతల దగ్గరికి వెళ్లి సచివాలయ సిబ్బంది స్థానిక నాయకులు కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయడంతో అవ్వ తాతలు ప్రజలు సంతోషంతో ఆనంద వ్యక్తం పరిచారు.ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు గాయం తిరుపతిరెడ్డి గాయం సుబ్బారెడ్డి ఉస్తేలా బెంజిమెన్ తాతపూడి స్టాండ్ జోన్స్ (బుజ్జి) వీఆర్వో ఝాన్సీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ను విమర్శించే స్థాయి మీకు లేదు



## అక్రమ దందాలు చేసేది మీరేకదా!

## మీ దందాలు కాపాడుకునేందుకే పార్టీలు మారేది

## ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న డోర్నకల్ అభివృద్ధి ఏది

## బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు విద్యసాగర్

**స్వర్ణ సాగరం డోర్నకల్ ఆగష్టు 01:**

మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్ ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కత్తెరసాల విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం మాజీ కౌన్సిలర్ మోనికా యశోదర్ జైన్, నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత పది సంవత్సరాల నుండి డోర్నకల్ అభివృద్ధి జరగలేదని ప్రగల్బాలు పలికే మీరు గత పది సంవత్సరాలు పదవులు అనుభవించింది మీరే కదా అని విమర్శించారు. బెల్లం, గుట్కా, రేషన్ బియ్యం, గ్యాస్, దందాలు చేసేది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఆనాడు మెయిన్ రోడ్డు ను అభివృద్ధి చేసే క్రమంలో అడ్డుపడ్డది మిరే కాదా అని ప్రశ్నించారు. 420, అరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన మీరు ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న డోర్నకల్ అభివృద్ధి ఎందుకు జరగలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. డోర్నకల్లో బిఆర్ఎస్, చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ చేసింది ఏం లేదన్నారు. సొసైటీ చైర్మన్ బిక్షం రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పోటు జనార్ధన్, శరత్, హేమచంద్రశేఖర్, నాయకులు మారబోయిన రాంభద్రం, మధు, సతీష్,(చంటి ) ప్రశాంత్, హున్ను నాయక్, కుమార్, మహిళా నాయకురాలు వెంకటమ్మ,తదితరులు ఉన్నారు

# కాణిపాక స్వామివారిని దర్శించుకున్న మురళీమోహన్








## ఘనంగా పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ జన్మదిన వేడుకలు

### అభిమానుల నుండి ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ

### ప్రజల సమక్షంలో భారీ కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే

ఐరాల ,ఆగస్టు 1 స్వర్ణ సాగరం

ఐరాల మండలం పూతలపట్టు నియోజకవర్గం, బంగారుపాళ్యంలో పూతలపట్టు శాసనసభ్యులు.డాక్టర్ కలికిరి మురళీమోహన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకుని అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం, స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఆలయ ఈవో పెంచల కిషోర్ అందజేశారు, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎమ్మెల్యే మురళీమోహన్ నివాళులు అర్పించారు. అనంతరం భారీ ర్యాలీగా మార్కెట్ యార్డ్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే కి పూతలపట్టు నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు కూరగాయలు, పండ్లతో రూపొందించిన విశేష గజమాలతో ఘనంగా సత్కరించారు. తరువాత మార్కెట్ యార్డ్ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొని కొత్తగా నియమితులైన చైర్మన్ మరియు డైరెక్టర్ల చేత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి భారీ కేక్ కట్ చేసి, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు తినిపించారు. ఈ వేడుకల్లో చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని , నగిరి శాసనసభ్యులు గాలి భానుప్రకాష్ మురళీమోహన్ జన్మదిన వేడుకల్లో పాల్గొని దుశ్శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలకు పెద్ద ఎత్తున నియోజకవర్గం నలుమూలల నుండి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సప్తగిరి ప్రసాద్, పూతలపట్టు మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, బంగారుపాళ్యం మండల అధ్యక్షులు ఎన్.పి.ధరణీ నాయుడు, ఐరాల మండల అధ్యక్షులు గంగారపు హరిబాబు నాయుడు, తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, యాదమరి మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, గంగాధరనెల్లూరు నియోజకవర్గం పరిశీలకులు ఎన్.పి.జయప్రకాష్ నాయుడు, చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, ఐరాల జెడ్పీటీసీ వి.సుచిత్ర కన్నయ్య నాయుడు, కాణిపాకం మాజీ ఛైర్మన్ మణినాయుడు, సింగల్ విండో అధ్యక్షుడు శేషాద్రి నాయుడు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ నాయుడు మరియు డైరెక్టర్స్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ ఎన్.పి.జయచంద్రనాయుడు, మాజీ జెడ్పీటీసీ లతా బాబునాయుడు మరియు పూతలపట్టు నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఊపిరితిత్తుల క్యాన్సర్ పై అవగాహన సదస్సు



కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 01

ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కనిగిరి పురపాలక సంఘం కార్యాలయ ప్రాంగణంలో సి ఓ టి పి ఎ యాక్ట్ టాస్క్ ఫోర్స్ టీమ్,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పొగాకు, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం లాంటి జాగ్రత్తలు ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగం బారిన పడకుండా అడ్డుకుంటాయని అన్నారు.క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండడం ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం లాంటి చర్యలతో క్యాన్సర్ లేని ప్రపంచాన్ని నిర్మించే ప్రయత్నాలు చేద్దామని తెలిపారు.మున్సిపాలిటీ కమిషనర్ పి. కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పని పూర్తయిన వెంటనే చేతులు కడుక్కోవడం తప్పనిసరని ఇంటికి వెళ్లిన వెంటనే శుభ్రంగా స్నానం చేయడం, సిగరెట్ లాంటి అలవాట్లకు దూరంగా ఉండటం, మంచి ఆహారం, వ్యాయామం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మంద్రు ప్రవీణ్ కుమార్ ఊపిరితిత్తుల క్యాన్సర్ లక్షణాలు, చికిత్స మార్గాలు, జాగ్రత్తలు పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎడిషనల్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్, శానిటేరీ ఇన్స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ రమేష్ బాబు,జి ఎస్ అండ్ జి డి కె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవ కుమార్,టాస్క్ ఫోర్స్ టీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



### - భవిష్యత్ సహకారం కోసం పూర్వ విద్యార్థుల నెట్వర్క్ ప్రారంభం

శ్రీ సిటీ,స్వర్ణ సాగరం ఆగస్టు 01, 2025:

ట్రిపుల్ ఐటీ–శ్రీసిటీ 9వ స్నాతకోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాల ఆవరణలో 2025 పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అసోసియేట్ డీన్ (పూర్వ విద్యార్థి) ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో ప్రస్తుత గ్రాడ్యుయేట్లు, మునుపటి బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు, డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవి కార్తికేయన్, ఇంకా రిజిస్ట్రార్, డీన్ సహా అధ్యాపక బృందం పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులను అభినందిస్తూ, కళాశాలతో అనుబంధాన్ని కొనసాగించాలని ప్రోత్సహించారు. ఈ సమావేశం గ్రాడ్యుయేట్లు మెంటర్‌లతో అనుబంధాన్ని, జ్ఞాపకాలను పంచుకోవడానికి మరియు జూనియర్‌లతో ఇష్టాగోష్టిగా గడపడానికి మధురానుభూతిని మిగిల్చింది. ట్రిపుల్ ఐటీ–శ్రీసిటీ కమ్యూనిటీ స్ఫూర్తిని హైలైట్ చేస్తూ పలువురు పూర్వ విద్యార్థులు వ్యక్తిగతంగా, వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేకాంశంగా ట్రిపుల్ ఐటీ–శ్రీసిటీ పూర్వ విద్యార్థుల నెట్వర్క్ ను ప్రారంభించారు. ఇందులో 2025 వరకు, ప్రతి బ్యాచ్ నుండి ఇద్దరు ప్రతినిధులను (పూర్వ విద్యార్థులు) కళాశాలతో సంబంధాలను బలోపేతం చేయడానికి మరియు విద్యావేత్తలు, పరిశోధనలు, పరిశ్రమలలో సహకారాన్ని ప్రోత్సహించడానికి నియమించారు.ఇంకా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, విందు, ఫోటో సెషన్ లతో సమావేశం ఎంతో వేడుకగా ముగిసింది.

# పేదల పక్షపాతి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు...

### అభివృద్ధి అజెండాగా ప్రశాంతమ్మ పాలన...

### పాటూరు నీటి సంఘాల ఉపాధ్యక్షులు శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి..



కోవూరు, స్వర్ణ సాగరం, ఆగష్టు 1:

కోవూరు మండలం, గంగవరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీ కార్యక్రమం కోవూరు శాసన సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో పాటూరు నీటి సంఘాల ఉపాధ్యక్షులు శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి పెన్షన్ల పంపిణీ చేపట్టారు. నూతనంగా వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా శింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి మాట్లాడుతూ, గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబు నాయుడు సామాజిక పింఛన్లను పెంచి పేదలకు అండగా నిలిచారని అన్నారు. ఆయన హయాంలో ?200గా ఉన్న పింఛన్‌ను మొదట ?2,000కి, ఆ తర్వాత ?3,000 నుంచి ?4,000కి పెంచారని గుర్తు చేశారు. పింఛన్‌ల పెంపుతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఆర్థికంగా కొంతవరకు నిలదొక్కుకుంటున్నారని ఆయన తెలిపారు. అదే గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో పింఛన్ 1000 రూపాయలు పెంచేందుకు ఐదు సంవత్సరాలు సమయం జగన్మోహన్ రెడ్డి తీసుకున్నారన్నారు. ఇస్తున్న 4000 పింఛన్ లో 2800 రూపాయాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ నే పెంచిందన్నారు. ?గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. సమస్యలుంటే నేరుగా వచ్చి తెలియజేయాలన్నారు. అధికారపక్షం, ప్రతిపక్షం అనే తేడాలు లేకుండా గ్రామంలో ప్రతి ఒక్క లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు అనుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాయబ్, వీఆర్వో రమేష్, గంగవరం టీడీపి ఎస్టీ సెల్ అధ్యక్షులు మాణిక్యాల మురళి, గంగవరం ఎస్సీ సెల్ అధ్యక్షులు రమేష్, టీడీపి నాయకులు కార్యకర్తలు గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికులు గా మారిన కాంగ్రెస్ నాయకులు



### చీపుర్లతో రోడ్డు శుభ్రం ప్రజా ఆరోగ్యమే మా ధ్యేయం

### పట్టణ మార్పుకు అడుగులు జీవ వాయువుకు మొక్కలు ప్రధానం

స్వర్ణ సాగరం డోర్నకల్ ఆగష్టు 01:

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని పట్టణ కాంగ్రెస్ శ్రేణులు నినాదించారు. ఒక చర్య..ఒక మార్పులో భాగంగా పురవీధులను చీపుర్లతో శుభ్రపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే, విప్,డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రామచంద్రనాయక్, ఆదేశాల మేరకు పురపాలకలో పరిసరాల పరిశుభ్రత,శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరి ఆరోగ్యం పరిశుద్ధం పై ఆధారపడి ఉందన్నారు.చేయి చేయి కలిపి స్వచ్ఛ మున్సిపాలిటీకి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం హై స్కూల్ ఆవరణములో మొక్కలు నాటారు. పారిశుద్ధ్య కార్మికులను శాలువలతో సన్మానించారు. పుర కమిషనర్ నిరంజన్, సీఐ రాజేష్, ప్రధానోపాధ్యాయుడు బండి నరసింహారావు,జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు సుమీర్ జైన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, శీలం శ్రీనివాస్,మాదా శ్రీనివాస్, రెడ్డబోయిన శంకర్,

ఖాదర్ బాబా, సొడం మహేష్, ఏపూరి రమణయ్య,లక్ష్మణ్, కాసం శేఖర్,వెంకన్న, నాని యాదవ్, ఫరిద్, సర్వయ్య, ఉపాధ్యాయులు, మెప్మా,మునిసిపల్ సిబ్బంది తదితరులున్నారు.

# గోకులాలకు బిల్లుల చెల్లింపులో జాప్యం చేయరాదు :జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్.



చిత్తూరు, స్వర్ణ సాగరం,ఆగస్టు 01

గోకులాల బిల్లులు చెల్లింపులలో జాప్యం చేయరాదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలో నరేగా పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాడి పశువులకు నీడ కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మినీ గోకులాల పేరుతో షెడ్ల నిర్మాణాలు చేపట్టింది. ఉపాధి హామీ నిధులతో పశు సంవర్ధక శాఖ సహకారంతో ఈ షెడ్ల నిర్మాణాలకు లబ్దిదారులను ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,795 మినీ గోకులాల షెడ్లు నిర్మించడమే ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఒక్కో షెడ్ నిర్మాణానికి సుమారు రూ.2.30 లక్షల అంచనా వ్యయంతో రూ.62.93 కోట్ల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పనుల్లో పురోగతి చూపేలా షెడ్ల పనులు పూర్తికాగానే 10 రోజులలో బిల్లులు అప్లోడ్ చేయాలన్నారు. కాంట్రాక్టర్లు, పొలిటికల్ వారితో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించి పనులను పూర్తి చేయాలన్నారు. ఏమైనా మీ పరిధిలో పనులు ఇబ్బంది ఉంటే నా దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఏ పనులు అయితే జరిగాయో ఆ పనులు మాత్రమే ఆన్లైన్ నందు మెటీరియల్ షీట్ నందు అప్లోడ్ చేసి ఎస్టిమేషన్ రెడీ చేయాలన్నారు. పూతలపట్టు, చౌడేపల్లి నందు ఎస్ ఈ ఇరిగేషన్ పనులపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు.పోస్ట్ ఆఫీసులో జీరో అకౌంట్ ఓపెన్ చేసుకోవచ్చు అని సిస్టం వినియోగించుకో వచ్చునన్నారు. పోస్ట్ ఆఫీస్ లో చాలా ఉపయోగాలు ఉన్నాయని పోస్ట్ ఆఫీస్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడి డ్వామా, డిఈ లు, ఏ ఈ లు, ఇరిగేషన్ అధికారులు, ఏపీ డీలు, ఏపీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తిన్నెలపూడి గ్రామంలో స్పౌజ్ పింఛన్లు పంపిణీ

కోట స్వర్ణసాగరం ఆగష్టు 1



కోట మండలం తిన్నెలపూడి పంచాయతీ మాజీ సర్పంచ్ పురిణి శ్రీనివాసులు, బూత్ కన్వీనర్ కట్టా జనార్ధన్,సుష్మా రెడ్డి ఆధ్వర్యంలో వితంతువులకు స్పౌజ్ కోటాలో నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు.తిన్నెలపూడి పంచాయతీ మాజీ సర్పంచ్ పురిని శ్రీనివాసులు,బూత్ కన్వీనర్ కట్టా జనార్ధన్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పథకం కింద వృద్ధులకి,వితంతువులకి ఇంటి వద్దనే పెన్షన్ ప్రక్రియను ఉదయం ఏడవ గంటల నుండే సచివాలయ సిబ్బంది ద్వారా ఇవ్వడం జరిగిందని తెలిపారు.నూతనంగా విడుదలైన స్పౌజ్ క్యాటగిరి పెన్షన్లను తిన్నెలపూడి పంచాయతీ మాజీ సర్పంచ్ పురిని శ్రీనివాసులు,భూత్ కన్వీనర్ కట్టా జనార్ధన్ తో కలిసి వాకాడులో పంపిణీ చేయడం జరిగింది.ఈ పంపిణీ కార్యక్రమంలో తిన్నెలపూడి మాజీ సర్పంచ్ పురిని శ్రీనివాసులు,బూత్ కన్వీనర్ కట్టా జనార్ధన్,సుష్మా రెడ్డి, తిన్నెలపూడి పంచాయతీ సెక్రెటరీ రియాజుద్దీన్,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# వెలుగు రుణాలు.... పేదలకు అందని ద్రాక్షేనా...?

-శ్రీ రంగరాజపురం:( స్వర్ణ సాగరం) ఆగస్టు 1)

ప్రతి కుటుంబంలో వెలుగు నింపాల్సిన సిబ్బందికే... (సంఘ మిత్రులకు) చీకటి కమ్ముకున్నట్లు.. చేసిన వెలుగు ఏపీఎం , అటు ప్రతినిత్యం నిర్లక్ష్య ధోరణితో సంఘ మిత్రులకు , గత రెండు సంవత్సరాల వ్యవధిలో వివిధ కారణాలు చూపి ఏడుగురు సంఘమిత్రాలకు కలిపి జీతాలు 64 నెలలకు గాను దాదాపు, రూ:5 లక్షలు పైగా ఆపిన సంఘటనతో పాటు వెలుగు కార్యాలయంలో మంజూరయ్యే రుణాలు నిరుపేదలకు అందని ద్రాక్షగా ఉందనే విషయం ,చిత్తూరు జిల్లా ,గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం, శ్రీరంగరాజపురం వెలుగు కార్యాలయంలో చోటు చేసుకున్న ఈ వదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

దీంతో సంఘమిత్రల బృందానికి-ఏపీఎంకు నిరంతరం సఖ్యత కుదరక పోవడంతో, పలు వివాదాలు కు దారి తీసినట్లు సంఘమిత్రలు బహిరంగంగా అభిప్రాయం వెలిబుచుతున్నారు.

**-సఖ్యతకు తిలోదకం.. అవినీతికి ఆదర్శంగా ఏపిఎం**

కొంతమంది సంఘమిత్రాలను తను అనుమాయిలుగా పోగుచేసుకుని... గ్రామ సమాఖ్య, మండల సమాఖ్యలో తను చేసింది వేదంగా, ఇప్పుడి మబ్బుడిగా రుణాలు మంజూరు చేస్తున్నారని పలు గ్రామ సమైక్య లీడర్లు, సంఘమిత్రులు బహిరంగంగా చేర్చించుకోవడం చర్చనీయాసమైంది.

**-మండల సమైక్య ద్వారా పెత్తందారులకు అధిక రుణాలు మంజూరు..?**

మండల, గ్రామ సమైక్య ద్వారా వివిధ సంఘాలకు



రుణాలు ఇచ్చే విషయంలో, భారీగా అధికార పెత్తనంతో పాటు, సంఘమిత్రలు కొందరు సభ్యులను తన అనుమాయిలు మార్చుకొని పేదలను అనగ దొక్కడమే కాకుండా, వడ్డీ వ్యాపారస్తులకు కొమ్ముకాస్తున్నారని తెలుస్తోంది.

**-నిరంతరం శ్రీరంగరాజుపురం వెలుగు కార్యాలయంలో ఏదో ఒక వివాదం..?**

గత రెండు సంవత్సరాలుగా శ్రీరంగరాజపురం మండల వెలుగు కార్యాలయంలో సంఘ మిత్రులకి, సీసీలకి, ఏపీఎంకు పొసకడం లేదు. దీంతో నిరంతరంగా సంఘ కార్యకలాపాలలో, క్షేత్రస్థాయి పర్యటనలు చేసే సందర్భాల్లో వివాదాలు చోటుచేసుకుంటాయని తెలుస్తుంది. ఈ వివాదాల్లో ఏపీఎంకు చేయూత ఇచ్చే వారికి సభ్యతగా వ్యవహరించడం, ఆపై వ్యతిరేకించిన వారిపై కచ్చిగా వ్యవహరించడం జరుగుతోందని కొందరు సంఘ మిత్రుల అభిప్రాయం తెలుపుతున్నారు.

**సంఘాల సభ్యులకు.. ఆదర్శంగా వ్యవహరించడంలో విఫలం చెందిన ఉద్యోగస్తులు..**

మండలంలో 947 సంఘ గ్రూపులు ఉన్నాయి. ఈ సంఘాల పనితీరును గుర్తించి సంఘ సభ్యులకు చేదోడు వాదోడుగా ఉండడానికి 36 ఈవోలు, 36 సంఘమిత్రాల కలిగి ఉన్నారు. వీరందరిపై పర్యవేక్షణకు నలుగురు సీసీలు గా వ్యవహరిస్తున్నారు. మండల మొత్తానికి కలిపి ఏపీఎం అధికారం కలిగి ఉన్నారు.

**నిలిచిపోయిన జీతాలను చెల్లించడానికి అవకాశాలు లేదు..సంఘమిత్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం**

సంఘమిత్రాలకు నిలిచిపోయిన జీతాల విషయంలో వివరణ అడగగా వివిధ కారణాలతో సంఘమిత్రాలకు చెల్లించాల్సిన తిరిగి ఇవ్వడానికి కుదరదని. ఒకసారి నిలుపుదల చేస్తే.. తరువాత ఇవ్వడానికి కుదరదన్నారు.

**జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణతో సమస్య కొలిక్కి వచ్చేనా..?**

శ్రీరంగరాజపురం మండలం వెలుగు కార్యాలయంలో సిబ్బంది పనితీరు, ఆపై రుణాల మంజూరులో ఏ వర్గానికి ఎంత మేరకు అందిందో , పేద సభ్యులకు చేరాల్సిన నిధులను కూడా, ప్రక్కదారి పట్టించి ఉన్నత వర్గానికి కట్టబెట్టిన విషయంలో జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని లెక్కలు నిగ్గ తేల్చాల్సి ఉందని పలువురు సంఘ సభ్యులు కోరుతున్నారని తెలుస్తోంది.

## విద్యుత్ వైర్లు సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధం





పూతలపట్టు స్వర్ణ సాగరం ఆగస్టు 1

పూతలపట్టు మండలం, వే నూతనపల్లి పల్లి పంచాయతీ, కూటం వారి పల్లి ఎస్టి కాలనీలో శుక్రవారం పూరిల్లు దగ్ధమైన సంఘటన చోటు చేసుకున్నది. వివరాల్లోకెళ్తే మిట్ట మధ్యాహ్నం విద్యుత్ వైర్ల ద్వారా వచ్చిన కరెంటు షార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు పూర్తిగా దగ్ధమైపోయింది. ఇది తెలుసుకున్న చుట్టుపక్కల వారు ఆర్ప లేని పరిస్థితి, కుటుంబ యజమాని ఏమి చేయలేని పరిస్థితుల్లో నిమ్మకుండిపోయారు. బట్టలు, ఆధార్ కార్డులు, వంట సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. సదరు విషయాన్ని సంబంధిత శాఖ సిబ్బంది దృష్టికి కి తీసుకుపోగా పై అధికారులకు తెలియజేశారు. రెక్కాడితే కానీ డొక్కాని ఈ రోజుల్లో వారి పరిస్థితి రోజుకి ఆరోజు కష్టపడి జీవనం సాగించే కుటుంబ సభ్యులు ఇద్దరూ కన్నీరు మున్నీరయ్యారు. ఆపై అధికారులు వచ్చి పరిశీలన చేయనున్నారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అంది వాళ్ళని కోరారు అదేవిధంగా గ్రామ ప్రజలు, దారిలో వెళ్లేవారు వారి జీవన విధానానికి సహాయ సహకారాల్ని అందించాలని కోరుతున్నారు.

## టిడిపితోనే గ్రామాల అభివృద్ధి

- మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు

ఏర్పేడు-స్వర్ణ సాగరం జులై 01



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాలతో ఏర్పేడు మండలం చింతలపాలెం గ్రామంలో సుపరిపాలన తొలి కార్యక్రమం భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచిపెట్టారు.మండల అధ్యక్షుడు పేరం నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమంలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో పేరం నాగరాజు నాయుడు, రెడ్డివారి గురువారెడ్డి, పేరం ధనంజయ నాయుడు, పున్నారావు, కేకే రమణ,పార్టీ పాల్గొన్నారు.

## వీకోట తూర్పు బైపాస్ అంశంపైరాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ని కలిసిన వీకోట టిడిపి నేతలు



వి కోట స్వర్ణ సాగరం ఆగస్టు 1:

చిత్తూరు జిల్లా వి కోట మండలం వికోటకు మంజూరైన బైపాస్ రోడ్డు అలైన్మెంట్ మార్చి గత పాలకులు మండల అభివృద్ధిని విస్మరించి ఈ ప్రాంత అభివృద్ధికి అన్యాయం చేశారని వివరించారు.జేఏసీ నేతృతంలో ఈ అంశంపై రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంను ఆశ్రయించి స్టేటస్కో కొనసాగిస్తున్నామని తెలియజేశారు.ప్రస్తుతం మంజూరైన మదనపల్లి కృష్ణగిరి రహదారి విస్తరణలో భాగంగా వీకోట తూర్పు వైపున నాలుగు లైన్ల బైపాస్ రోడ్డు నిర్మించాలని శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి మంత్రికి వివరించారు.నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరించిన మంత్రి ఈ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకొని వీకోటకు తూర్పు వైపున నాలుగు లైన్ల రోడ్డు వచ్చేలా ఎన్ హెచ్ ఏ ఐ దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తారని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఏఎం రంగనాథ్..మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్ర నాయుడు.. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మైందల రామచంద్రుడు..జిల్లా తెలుగు యువత కార్యదర్శి శబరిష్. మాజీ ఎంపీటీసీ సభ్యులు రామ్మూర్తి.. నారాయణస్వామి.. నాయకులు మురుగేష్.. రబ్బాని తదితరులు పాల్గొన్నారు .

## కానిస్టేబుల్ ఫలితాల్లో కొత్త కన్నలి యువకుడి విజయం,



స్వర్ణ సాగరం -తొట్టంబేడు,

శ్రీకాళహస్తి నియోజకవర్గంతొట్టంబేడు మండలంలోని పెద్ద కన్నలి పంచాయతీకి చెందిన కొత్త కన్నలి గ్రామ యువకుడు డి. సుదర్శన్ రెడ్డి కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించాడు.డీ. నారాయణ రెడ్డి కుమారుడైన సుదర్శన్ రెడ్డి శ్రీకాళహస్తిలో ఎంబీఏ పూర్తి చేసి, చిన్ననాటి నుంచే పోలీసు శాఖలో ఉద్యోగం చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకుని ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ కృషి చేశాడు. గతంలో ఒకసారి ప్రయత్నించి విఫలమైనా, సంకల్పం మరింత బలంగా మారి, రెండవసారిగా ప్రయత్నించి చివరికి విజయాన్ని తన వశం చేసుకున్నాడు.పేద కుటుంబంలో పుట్టినప్పటికీ ఎన్నో అడ్డంకులను అధిగమించి, పట్టుదలతో చదువుకొని తన లక్ష్యాన్ని చేరుకున్న సుదర్శన్ రెడ్డి ఈ విజయంతో కుటుంబ సభ్యులతో పాటు తన గ్రామానికే గర్వకారణంగా నిలిచాడు.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డిని కుటుంబ సభ్యులు, మిత్రులు, గ్రామస్థులు హర్షాతిరేకాలతో అభినందించారు.

## ప్రపంచ తల్లిపాల వార్షికోత్సవాలు



ఏర్పేడు-స్వర్ణ సాగరం జులై 01

రేణిగుంట ఐసీడిస్ ప్రాజెక్టు పరిధిలోని ఎర్పేడు మండలంలో ని అంజిమెడు, పల్లంపేట అంగన్వాడి కేంద్రాలలో 1.8 2025 నుండి 7.8 2025 వరకు జరిగే తల్లిపాల వారోత్సవాలలో బాగంగా సిడిపివో క్రిష్ణవేణి అధ్యక్షన తల్లిపాల వార్షికోత్సవ కార్యక్రమము నిర్వహించడం జరిగింది.ముఖ్యంగా తల్లిపాలు బిడ్డలకు ఇవ్వడం వలన తల్లికి బడ్డకి కలిగే ప్రయోజనాలు, వాటి ప్రాముఖ్యత గురించి మరియు తల్లిపాలు కల్తీ లేవ ని స్వచ్ఛమైనవి కాబట్టి తల్లిపాలు పిల్లలకు వరమని చెప్పడం జరిగింది. ఈ విషయాలు అన్ని కూడా తల్లులు పాటించాలని వారికి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపివో క్రిష్ణవేని, సూపర్ వైజర్, మేమావత్తి,రత్నమ్మ, అంగన్వాడి కార్యకర్తలు స్వర్ణలత , రామేశ్వరి, ఆషా వర్కర్, తల్లులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మురళీ మోహన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బుసా నాగరాజు గౌడ్



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగష్టు 1

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే మురళీమోహనకు మార్కెట్ యార్డ్ నందు నిర్వహించిన జన్మదిన వేడుకలలో చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ బిసి ఈడిగ సాధికారిక సమితి అధ్యక్షులు బుసా నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో బంగారు పాళ్యం మండల టిడిపి ఎస్.సి.సెల్ అధ్యక్షులు కె.స్వామిదాసు,బిసి నాయకులు యం.వరదరాజులు తదితరులు పాల్గొన్నారు

## ఎం.ఎల్.ఎ మురళీమోహన్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోతుకూరి సోమశేఖర్ నాయుడు



ఐరాల ఆగస్టు 1 స్వర్ణ సాగరం

ఐరాల మండలం,పూతలపట్టు శాసన సభ్యులు డాక్టర్ కలికిరి మురళీ మోహన్ నీ కలిసి ఫ్లవర్ బొకే అందజేసి జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేసిన జై ప్రాపర్టీస్ అధినేత, ఐరాల మండల తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి మోతుకూరి సోమశేఖర్ నాయుడు , ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఐరాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంగారపు హరిబాబు నాయుడు,సీనియర్ నాయకులు కోవూరి రాజశేఖర్ నాయుడు, బొబ్బా సోమశేఖర్ నాయుడు,యువనాయకులు భగవాన్ చౌదరి,జగదీష్ చౌదరి, పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యం

టిడిపి మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య





పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 1.

పేదల అభ్యున్నతి కూటమి ప్రభుత్వ లక్ష్యం అని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య వెల్లడించారు. శుక్రవారం ఇంటింటికి పింఛన్ కార్యక్రమం నిర్వహించి అర్హులందరికీ పెన్షన్ నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదల అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా అనేక సంక్షేమ పథకాలను పేదల కోసం కొనసాగించడం తెలుగుదేశం పార్టీ గొప్పతనానికి నిదర్శనం అన్నారు. ఈనెల 15 నుండి మహిళలు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఎన్నడు లేని విధంగా కొత్త పరిశ్రమల స్థాపనతో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వివరించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## శ్రీకృష్ణుని ఆలయంలో కిలివేటి సంజీవయ్యకి ప్రత్యేక పూజలు

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఆగస్టు 01.



తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం వెంగమాంబపురం గ్రామంలో ఉన్న శ్రీకృష్ణుని ఆలయంలో కృష్ణుడి పూజలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. గ్రామ ప్రజలు మరియు దేవాలయ ధర్మకర్త వారికి ప్రత్యేకత పూజలు నిర్వహించి అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందించారు.వారి వెంట నాయుడుపేట మండల వైసీపీ అధ్యక్షులు ఓటూరు కిషోర్ యాదవ్ , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం జయరామయ్య , గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు

## ఎమ్మెల్యే కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జడ్పీటిసి వి. సుచిత్ర కన్నయ్య నాయుడు



ఐరాల ఆగస్ట్ 1 స్వర్ణ సాగరం

ఐరాల మండలం పూతలపట్టు శాసనసభ్యులు కి జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన వి .సుచిత్ర కన్నయ్య నాయుడు. శుక్రవారం పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళి మోహన్ కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి ఫ్లవర్ బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఐరాల మండలం జడ్పిటిసి వి .సుచిత్ర కన్నయ్య నాయుడు, ఈ కార్యక్రమంలో ఐరాల మండలం మండల అధ్యక్షుడు గంగారావు హరిబాబు నాయుడు మండలంలోని నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు తదితరులు ఉన్నారు,

## ప్రజా భద్రతే మా ధ్యేయం





- సీఐ రాజేష్ నాయక్

స్వర్ణ సాగరం డోర్నకల్ ఆగష్టు 01

ప్రజా భద్రతే మా ధ్యేయమని స్థానిక సీఐ రాజేష్ నాయక్ అన్నారు.మై ఆటో ఇస్ సేఫ్ అవగాహన కార్యక్రమం ఓ వేడుకల వేదికలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఆటో డ్రైవర్ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.అపరిచితులు ఆటోల్లో నిషేధిత పదార్థాల తరలించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.ముఖ్యంగా మహిళ ప్రయాణికుల గమ్యస్థానానికి భద్రంగా చేర్చాలని పేర్కొన్నారు.ప్రతి ఆటోకు క్యూఆర్ కోడ్ కలిగి ఉండాలని అన్నారు.డ్రైవర్ వాహన వివరాలు పొందుపరిచి ఉంటాయని తెలిపారు.లక్ష రూపాయల ప్రమాద బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందని తెలియజేశారు.ఎస్సై వంశీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డికి స్వాగతం పలికిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



స్వర్ణ సాగరం(నాయుడుపేట) ఆగస్టు 01.

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో మూలాఖత్,మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని పరామర్శల నేపథ్యంలో గురువారం నెల్లూరుకు విచ్చేసిన వైయస్సార్సీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ కు మాజీ ఎమ్మెల్యే కిలివేట్ సంజీవయ్య పసుపు అందజేసి సాదర స్వాగతం పలికారు.

## పేదలకు వరం ఎన్టీఆర్ భరోసా పించన్లు.



### టిడిపి నాయకులు కాపులూరు చక్రపాణి.

స్వర్ణ సాగరం(నాయుడుపేట) ఆగస్టు01.

కూటమి ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు ఓ వరం లాంటిదని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాపులూరు చక్రపాణి అన్నారు. శుక్రవారం తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం కాపులూరు గ్రామంలో తెల్లవారుజామున ముందే పంచాయతీ సెక్రెటరీ తో కలిసి పింఛన్లదారుల ఇంటికి వెళ్లి పింఛలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాపులూరు చక్రపాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పింఛన్లు అందజేస్తున్నారని దీంతో అవ్వా తాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సులూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆదేశాల మేరకు,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సూచనల మేరకు కాపులూరు గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే భాగంగా ఎన్టీఆర్ భరోసా వృద్ధాప్య, వితంతువులు,వికలాంగులు, పింఛన్ల పంపిణీ చేశామని తెలిపారు.

## భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకంతోనే భూమికి ఆరోగ్యం...



ఏర్పేడు-స్వర్ణ సాగరం జులై 1

ఏర్పేడు మండలం బండార్లపల్లి గ్రామము నందు పీఎం ఆర్కే వి వై పథకం కింద జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారిచే రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమములో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు మాట్లాడుతూ, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితేనే రైతుకు సాగు ఖర్చు తగ్గడంతో పాటు , భూమికి ఆరోగ్యం చేకూరుతుంది, తద్వారా ఆహార భద్రత లభిస్తుంది, అని తెలియజేశారు . ఈ కార్యక్రమం నందు ఏర్పేడు మండలం వ్యవసాయ అధికారి సాగరిక మాట్లాడుతూ , సేంద్రియ ఎరువుల లను రైతులు తప్పనిసరి గా వాడుకోవాలని, వ్యవసాయ శాఖ ప్రస్తుతం అమలు చేస్తున్న వివిధ పథకాలను మరియు పంటల భీమా పథకం గురించి, వివరించారు. పంటల భీమా కట్టుకోవాల్సిన వారు వారి సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బందిని కలవవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రియాంక మరియు జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవి ప్రసాద్, మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర వైసిపి సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రెటరీ గా కిషోర్ కుమార్ రెడ్డి నియామికం



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 1

రాష్ట్ర వైసిపి సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీగా బంగారుపాలెం మండలం తుమ్మోజి పల్లి గ్రామానికి చెందిన కిషోర్ కుమార్ రెడ్డిని నియమించినట్లు వైయస్సార్ పార్టీ అధిష్టానం తెలిపింది తన సేవలను వైఎస్సాఆర్ పార్టీ గుర్తించి ఈ పదవిని తనకు ఇచ్చినందుకు పదవి రావడానికి కారకులైన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపీ మిథున్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్,లలిత కుమారి, చిత్తూరు జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎం బి కుమార్ రాజా, రామచంద్రారెడ్డి,శిరీష్ రెడ్డి లకు అభినందనలు

# వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం







బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 1

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శుక్రవారం చేశారు ముందుగా బంగారుపాల్యం పట్టణం నుండి వ్యవసాయ మార్కెట్ వరకు నిర్వహించిన ర్యాలీలో పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు,వైస్ చైర్మన్ సుధాకర్,ఎన్ పి జయప్రకాష్ నాయుడు,ఎన్ పి ధరణి ప్రసాద్,హరిబాబు నాయుడు,వెంకటేశ్వర చౌదరి,సప్తగిరి ప్రసాద్, లత,లోకానాథనాయుడు, హేమచంద్రనాయుడు, జనార్దన్,వెంకటాపురం మోహన్ నాయుడు,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు అనంతరం నూతన కమిటీ చే ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారోత్సవానికి భారీ ఎత్తున తెలుగుదేశం పార్టీ శ్రేణులు హాజరు కావడంతో ఆ పార్టీలో నూతన ఉత్సాహం నింపింది. ముందుగా నిర్వహించిన ర్యాలీలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ డాన్స్ చేస్తూ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉత్సాహపరిచారు.ఈ ప్రమాణ స్వీకారానికి పూతలపట్టు నియోజకవర్గం లోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి -మాజీ సైనికుడు పులి శ్రీకాంత్

స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి,



శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న యువ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కోరుతూ, మాజీ సైనికుడు, న్యాయవాది పులి శ్రీకాంత్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు.బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడిగా తండ్రికి తగ్గ శ్రేష్ఠ నాయకత్వాన్ని చూపిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి నిబద్ధతతో పనిచేస్తున్న సుధీర్ రెడ్డి కి మంత్రి పదవికి అర్హులని అభిప్రాయపడ్డారు. తిరుపతి జిల్లాలో ఒక్క మంత్రి కూడా లేకపోవడంతో, ఆయనకు మంత్రి పదవి ఇచ్చితే జిల్లాకు ప్రాతినిధ్యం లభించ నుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పాన్ని ఎలా అభివృద్ధి చేసి నారో అదే విధంగా శ్రీకాళహస్తిని అభివృద్ధి చేయగల నాయకుడు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి అన్నారు.

గత పాలనలో మూతపడిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను తిరిగి ప్రారంభించి, స్థానిక పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే విధంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో చేసిన కృషి అభినందనీయం అన్నారు. స్కిట్ పునఃప్రారంభంతో శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, సత్యవేడు, సూళ్లూరు పేట తదితర నియోజకవర్గాల విద్యార్థులకు మేలు జరిగిందని పేర్కొన్నారు.తండ్రి నుండి వారసత్వంగా అందుకున్న పరిపాలన కౌశల్యంతో, టెక్నాలజీని వినియోగించుకుంటూ వేగంగా అభివృద్ధి సాధిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కి మంత్రి పదవి ఇవ్వడం ద్వారా నియోజకవర్గానికి మరింత గౌరవం కలుగుతుందని, అలాగే తెలుగుదేశం పార్టీకి పటిష్టమైన బలమవుతుందని పులి శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు.

## ప్రజలకు రాజ్యాంగమే పరిరక్షణ.



కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 01

ప్రజలకు రాజ్యాంగమే పరిరక్షణ అని డిప్యూటీ తాసిల్దార్ కనమాల రవి, ప్రముఖ న్యాయవాది యర్రజాల బాల నారాయణ అన్నారు.శుక్రవారం కనిగిరిలోని ఒంగోలు బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ప్రతినెల ఒకటో తేదీ అంబేద్కర్ ధర్మ పోరాట సమితి ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలలు వేసే కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం రక్షణ ప్రజల బాధ్యతని రాజ్యాంగం ఉంటేనే ప్రజల హక్కులు కాపాడగలుగుతాయని అన్నారు.దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, మాల జేఏసీ జిల్లా నాయకులు కల్వకురి శాంతరాజు, ప్రముఖ న్యాయవాది చింతగుంట్ల కిషోర్, నియోజకవర్గ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు కొటికల బాలబాదుర్ల,రిటైర్డ్ లైన్ ఇన్స్పెక్టర్ మురారి వెంకటేశ్వర్లు, కొండారెడ్డిపల్లి ఎంపీటీసీ హనుమంతుడిపాడు వైస్ ఎంపీపీ రుద్రపాటి శోభా రాజు, వెంకటేశ్వర్లు, కోంద్రు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు



### ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 01

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించటమే కూటమి ప్రభుత్వా లక్ష్యమని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి అన్నారు శుక్రవారం కనిగిరి టిడిపి కార్యాలయంలో నూతనంగా మంజూరైన 79 ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు నిష్పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి టిడిపి పట్టణ అధ్యక్షుడు తమ్మునేని శ్రీనివాసరెడ్డి ఫిరోజ్ బాలు ఓబుల్ రెడ్డి టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి



స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి ఆగస్టు 1:-

చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని మంత్రి జనార్ధన్ రెడ్డి తెలిపారు. బైరెడ్డిపల్లి మండలంలో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. గత సంవత్సర కాలంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేసే కరపత్రాలను గ్రామస్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రమా దకరంగా మారిన విద్యుత్ స్తంభం



స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి ఆగస్టు 1:-

చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి కడపనత్తం రోడ్డులో గల విద్యుత్ స్తంభం పైన భాగం విరిగిపోయి ఎప్పుడు వైర్లు తెగి కిందపడి ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో అని భయాందోళనలో అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే స్తంభాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆగస్టు 3న కుప్పం నుండి ఇచ్ఛాపురం వరకు రాజ్యాంగ పరిరక్షణ ప్రారంభ యాత్రని జయప్రదం చేయండి





**కుప్పం స్వర్ణ సాగరం న్యూస్**

కుప్పం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఈరోజు జరిగినటువంటి ప్రత్యేక సమావేశంలో, ఆగస్టు 3 నుండి ప్రారంభం అయ్యేటటువంటి రాజ్యాంగ పరిరక్షణ యాత్రని జయప్రదం చేయాలని రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తులిబిల్లి అశోక్ బాబు, రాజ్యాంగం అనువాదుకులు దాసరి చెన్నకేశవులు గారు మాల జేఏసీ రాష్ట్ర నాయకులు ఎనముల సుదర్శనం గారు, బహుజన సేన రాష్ట్ర కార్యదర్శి గోవిందప్ప గారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తులిబిల్లి అశోక్ బాబు మాట్లాడుతూ ఈ యొక్క రాష్ట్రంలోని ప్రజలందరకు రాజ్యాంగం పై అవగాహన కల్పిస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి ఇచ్చినటువంటి రిజర్వేషన్ సక్రమంగా అమలు చేయాలని, రిజర్వేషన్ వర్గీకరణ క్రిమిలేయర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ శాతం అమలు చేయాలని, ఎస్సీలకు రిజర్వేషన్ శాతం పెరిగిన జనాభాకు 20% శాతం పెంచాలని ,దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని, దళితుల మీద జరుగుతున్నటువంటి దాడులను వ్యతిరేకించాలని, యావత్ ఆంధ్ర రాష్ట్ర మొత్తాన్ని చైతన్యం చేయడానికి ఈ యొక్క రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ప్రారంభిస్తున్నామని ,ఈ యొక్క యాత్ర కి యావత్ రాష్ట్రంలోని ముఖ్య నాయకులందరూ కూడా పాల్గొనాలని, అదేవిధంగా ఈ యొక్క యాత్రలో అన్ని జిల్లాల్లోని ప్రజలందరూ కూడా జయప్రదం చేయాలని తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో భారత రాజ్యాంగాన్ని తెలుగులోకి అనువదించినటువంటి డాక్టర్ చెన్నకేశవులు గారు, రాజ్యాంగం యొక్క హక్కులు విధులు రాజ్యం యొక్క విశిష్టతను యావద రాష్ట్ర ప్రజలకు తెలియజేస్తారని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గం స్థానిక మాల నాయకులు,బహుజన  నాయకులు బహుజన సేన జిల్లా అధ్యక్షులు జిల్లాఉపాధ్యక్షులు ఎన్ కుమార్ గారు, కుప్పం టౌన్ బీసీ అధ్యక్షులు రాము గారు, శాంతిపురం యూత్ అధ్యక్షులు శ్రీనాథ్ బాబు, గురుమూర్తి యూత్ ఉపాధ్యక్షులు, రామకుప్పం మండల అధ్యక్షులు రమణ గారు. మరియు పెద్ద ఎత్తున దళితుల పాల్గొని రాజ్యాంగ పరిరక్షణ యాత్రని జయప్రదం తెలియజేయాలని పిలుపునిచ్చారు

## సినీ హీరో మంచు విష్ణుకు ఘన స్వాగతం పలికిన బిజెపి ప్రేమ్ కుమార్ రెడ్డి



**రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 01**

ప్రముఖ సినీ హీరో మంచు విష్ణుకు రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శుక్రవారం విమానాశ్రయం చేరుకున్న మంచు విష్ణుకు రేణిగుంట మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ రెడ్డి శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. ఆయనకు స్వాగతం పలకడానికి మంచు విష్ణు అభిమానులు భారీగా విమానాశ్రయం చేరుకునీ స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు.

## వైయస్సార్సీపి సోషల్ మీడియా స్టేట్ అధికార ప్రతినిధి  కిషోర్ కుమార్ రెడ్డి కి శుభాకాంక్షలు



**చిత్తూరు,సర్వసాగరం ఆగస్టు 1**

స్వ శక్తితో, అంచెలంచెలుగా ఎదిగి  న మా మిత్రుడు, శ్రేయోభిలాషి, నా ఆత్మీయ సహోదరుడు, పెద్దిరెడ్డి ఫ్యామిలీకి వీర విధేయుడు, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అమితంగా ప్రేమించే అనుంగ్య శిష్యుడు, అందరివాడు,  కిషోర్ కుమార్ రెడ్డి ని రాష్ట్ర వైసిపి స్టేట్ సోషల్ మీడియా అధికార ప్రతినిధి  (జనరల్ సెక్రెటరీ ) గా నియమించిన అందరికీ మా హృదయపూర్వక ధన్యవాదాలు, మా సహోదరుడికి శుభాకాంక్షలు మీ కమలాపతి రెడ్డి. బంగారుపాళ్యం మండల వైఎస్సార్ సీపీ జనరల్ సెక్రెటరీ.

## కనిగిరిలో కనుమరుగైన  ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

**కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 01**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమం కనిగిరిలో కనుమరుగైపోయింది.ప్రతి శుక్రవారం మంగళవారం ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పారిశుధ్య సిబ్బంది సచివాలయం పరిధిలోని ఇంటింటికి వెళ్లి పరిసరాలు పరిశుభ్రత పై ప్రజలుకు అవగాహణ కల్పించి పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి దోమలు వృద్ధి చెందకుండా ఉండుటకు జాగ్రత్తలను తెలియ జేయాలి. కనిగిరి శివారు ప్రాంతాలైన కాశీ రెడ్డి కాలనీ శివ నగర్ కాలని పట్టణంలోని పలు సచివాలయం పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం కనుమరుగైంది.ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సీజనల్ వ్యాధులు,ముఖ్యంగా దోమల ద్వారా వచ్చే వ్యాధుల నివారణ వ్యాధులు గురించి ఉద్దేశించబడింది.కానీ, ఇటీవల కాలంలో దీని గురించి పెద్దగా వినిపించడం లేదని ఇప్పటికైన సంబంధిత శాఖ ఉద్యోగులు "ఫ్రైడే డ్రైడే"అనేది ఒక ప్రత్యేక కార్యక్రమంగా భావింవి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సూత్రాలను తెలియాలని  ప్రజలు కోరడమైనది.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

### ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం స్వర్ణసాగరం న్యూస్**

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. కుప్పం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో శుక్రవారం నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పురపాలక సంఘం అధ్యక్షులు సెల్వరాజు ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాసరావు నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ తో పాటు ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నంలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని వయోవృద్ధులకు, ఒంటరి మహిళలకు, విభిన్న ప్రతిభావంతులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆర్థిక భరోసాను కల్పిస్తూ ప్రభుత్వం ఎన్టీఆర్ పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఇప్పటికే పెన్షన్ పథకానికి అమలు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి రెండు విడుదలగా పెన్షన్ పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి సైతం త్వరితగతిన పెన్షన్ అందేలా చర్యలు చేపడుతున్నామని, అర్హత కలిగిన ఏ ఒక్కరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు రాజకుమార్, పురపాలక సంఘం కౌన్సిలర్లు జగన్, సురేష్, సోమశేఖర్, నాయకులు గోపీనాథ్, డాక్టర్ సుధీర్, గణపతి, వేలు, ఆర్ముగం, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## అభివృద్ధిపై బీజేపీ ఫోకస్

### - నియోజకవర్గ నాయకులు నరేష్

**స్వర్ణ సాగరం డోర్నకల్ ఆగస్టు 01**

ప్రజలు పాలకులకు పదవులు అందిస్తే నియోజకవర్గ అభివృద్ధిని మరిచారని బిజెపి యువ నాయకుడు దారావత్ నరేష్, ఆరోపించారు.శుక్రవారం విలేకర్ల సమావేశ ంలో ఆయన మాట్లాడారు. గత 40 ఏండ్లుగా ఈ ప్రాంతం వివక్షకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.సమ్మర్ స్టోరేజ్ నేడు డంపింగ్ యార్డ్ గా మారిందని ఆవేదన చెందారు.నియోజకవర్గ కేంద్రానికి ఉండాల్సిన అభివృద్ధి,సౌకర్యాలు లేవని అన్నారు.బిజెపి మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.కరోనా అనంతరం రద్దైన రైళ్లలు నిలుపుదలకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు లఖన్ వ్యాస్,మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు రెహమాన్, నాగేష్, మైను పాషా,హనుమంతులు తదితరులున్నారు.



## అనుష్కా శెట్టి 'ఘాటి' రిలీజ్ అప్పుడేనా?



అనుష్కా శెట్టి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఘాటి'. ఈ సినిమాలో విక్రమ్ ప్రభు మరో కీలక పాత్రలో నటించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో జాగర్ల మూడి రాధాకృష్ణ (క్రిష్) దర్శకత్వంలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. జూలైలో విడుదల కావాల్సిన ఈ సినిమా రిలీజ్ వాయిదా పడిన సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమాను నవంబరులో రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. వీఎఫ్ఎక్స్ వర్క్స్‌పై మరింత శ్రద్ధ పెట్టి, మంచి క్వాలిటీతో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలన్నది టీమ్ ప్లాన్. దీంతో ఓ దశలో సెప్టెంబరులో రిలీజ్ అనుకున్నప్పటికీ నవంబరులో అయితే మరిన్ని థియేటర్స్ కూడా దొరకుతాయని, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌కు మరింత సమయం లభిస్తుందని కూడా చిత్రయూనిట్ ఆలోచిస్తోందట. అయితే ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. 'ఘాటి' సినిమా తెలుగు, తమిళ, హిందీ, మలయాళంతో సహా పలు భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. ఈ సినిమాకు సంగీతం: నాగవెల్లి విద్యాసాగర్.

## శివకార్తికేయన్ 'మదరాశి' నుంచి 'సెలవిక కన్నమ్మా' రిలీజ్

తమిళ నటుడు శివకార్తికేయన్ నటిస్తున్న తాజా చిత్రం 'మదరాశి' ఈ సినిమాకు దిగ్గజ దర్శకుడు మురుగదాస్ దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీ లక్ష్మీ మూవీస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. 'అమరన్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత శివకార్తికేయన్ నుంచి ఈ సినిమా వస్తుండటంతో మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ చిత్రం సెప్టెంబర్ 5, 2025న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. కన్నడ నటి రుక్మిణి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ మొదటి సింగిల్ 'సెలవిక కన్నమ్మా' అనే పాటను విడుదల చేశారు. లవ్ ఫెయిల్యూర్‌గా ఈ పాట ఉండబోతుందని లిరిక్స్ చూస్తే అర్థమవుతుంది.








## ఓటీటీలో 'హరి హర వీరమల్లు'.. నెలరోజుల్లోనే స్ట్రీమింగ్!


పవన్ కల్యాణ్ నటించిన తొలి పాన్-ఇండియన్ సినిమ 'హరి హర వీరమల్లు' నెలరోజుల్లోనే ఓటీటీలోకి రానుంది. ఈమేరకు సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. జులై 24న విడుదలైన ఈ చిత్రానికి క్రిష్, జ్యోతికృష్ణ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. సుమారు రూ. 250 కోట్లతో ఎ.ఎం.రత్నం నిర్మించారు. అయితే, మొదటి ఆటతోనే భారీ డిజాస్టర్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో సుమారు రూ. 110 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ మాత్రమే సాధించినట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీలోకి రానుందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. 'హరి హర వీరమల్లు' ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో కొనుగోలు చేసింది. ఈ క్రమంలో ఆగష్టు 22న ఈ చిత్రాన్ని ఓటీటీలో విడుదల చేయాలని మొదట డీల్ సెట్ చేసుకున్నారట. అయితే, సినిమా డిజాస్టర్‌గా మిగలడంతో నిర్మాతలు తమ ప్లాన్‌లో మార్పులు చేస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వైరల్ అవుతుంది. తాజా సమాచారం ప్రకారం వీరమల్లు డిజిటల్ విడుదల విషయంలో పరిశీలిస్తున్నారట.. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్ట్రీమింగ్‌కు తీసుకురావలనే ప్లాన్‌లో ఉన్నారట. అదే జరిగితే 30రోజుల్లోనే ఓటీటీలోకి వచ్చేసినట్లు అవుతుంది. అయితే, ఓటీటీ విడుదల విషయంలో మేకర్స్ ఎలాంటి ప్రకటన చేయలేదు. 'హరి హర వీరమల్లు' విడుదలతోపాటు వివాదాలను కూడా తీసుకొచ్చింది. కోహినూర్ వజ్రానికి చరిత్రలో ఒక ప్రత్యేక స్థానమున్నది. దానిది అంతర్జాతీయ ఖ్యాతి. అయితే, ఈ చారిత్రక అంశాల మధ్య వీరమల్లు అనే కల్పిత పాత్రను ప్రవేశపెట్టి ఈ సినిమా తీయడంతో చాలామంది తప్పుబట్టారు. కల్పిత వీరమల్లు ఔరంగజేబుతో పోరాడి గోల్కొండకు వజ్రాన్ని ఎలా తీసుకువస్తాడనేది సినిమా కథగా చెప్పడం ఏంటంటూ విమర్శించారు. ఫాంటసీ పేరుతో చరిత్రను వక్రీకరించడం.. ఆ వక్రీకరణ ద్వారా సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా సినిమా ఉందంటూ కొందరు పేర్కొన్నారు. ఇలా అనేక కారణాల వల్ల సినిమాకు ఎక్కువ నష్టం జరిగింది.

## కింగ్డమ్ ఫస్ట్‌డే కలెక్షన్స్.. కెరీర్ బిగ్గెస్ట్ ఓపెనింగ్

హీరో విజయ్ దేవరకొండ కోటి ఆశలు పెట్టుకున్న కింగ్డమ్ మూవీ జూలై 31న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు కొంత నెగెటివ్ టాక్ ఉన్నప్పటికీ పాజిటివ్ టాకే ఎక్కువగా వినిపిస్తోంది. దీంతో ఫస్ట్ రోజు కలెక్షన్స్ ఎంతన్నదానిపై అందరి దృష్టి పడింది. కానీ, ఎవరి లెక్కలకు అందనంతంగా భారీ కలెక్షన్స్ వచ్చాయి. కింగ్డమ్.. తొలి రోజు ఏకంగా రూ.39 కోట్లు రాబట్టింది.


**హిట్టు కొట్టినం :** ఈ మేరకు చిత్రయూనిట్ అధికారికంగా పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ పోస్టర్‌ను రౌడీ హీరో షేర్ చేస్తూ మనం (హిట్) కొట్టినం అని సంతోషాన్ని వ్యక్తం చేశాడు. ఇది విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్..! ఇకపోతే కింగ్డమ్ వీకెండ్‌లో రాలేదు, అందులోనూ హాలీడే అసలే లేదు. అయినా ఈ రేంజ్‌లో కలెక్షన్స్ రావడంతో విజయ్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. లైగర్ మూవీ వచ్చినప్పుడు ఎన్నెన్ని మాటలన్నారు.. అప్పుడు ఎత్తిన నోళ్లు దించుకునేలా మా హీరో కింగ్డమ్‌తో సమాధానం చెప్పాడని సంతోషపడుతున్నారు.

**ఆ సినిమాలతోనే పోటీ :** అయితే ఈ చిత్రానికి.. మహావతార్ నరసింహ, సయారా చిత్రాల నుంచి గట్టి పోటీనే ఉంది. హరిహర వీరమల్లును జనాలు ఎలాగో లైట్ తీసుకున్నారు కాబట్టి ఇదేమంత పోటీ కాదు. ముమ్ముందు కింగ్డమ్ ఎన్ని బాక్సాఫీస్ రికార్డులు బ్రేక్ చేస్తుందో చూడాలి! కింగ్డమ్ సినిమా విషయానికి వస్తే.. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే హీరోహీరోయిన్లుగా నటించారు. సత్యదేవ్, వెంకటేశ్, కసిరెడ్డి కీలక పాత్రలు పోషించారు. జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించగా సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. అనిరుద్ రవిచందర్ సంగీతం అందించాడు




## నాని 'ది ప్యారడైజ్' గ్యాంగ్‌స్టర్ లుక్ వైరల్.. 2026లో మోస్ట్ అవైటెడ్ మూవీగా..!

దసరా విజయంతో నేషనల్ లెవెల్‌కి ఎదిగిన నేచురల్ స్టార్ నాని, ఇప్పుడు మరోసారి డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో జట్టుకట్టాడు. ఈ కాంబినేషన్‌లో రూపొందుతున్న కొత్త యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' టాలీవుడ్‌లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాను నాని కెరీర్‌లోనే అతిపెద్ద బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. 1980–90 సమయంలో హైదరాబాదు గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కించనుండగా, ఈ ప్రాజెక్ట్‌ను 2026 మార్చి 26న గ్లోబల్‌గా విడుదల చేయనున్నారు. ఇటీవల లీక్ అయిన నాని లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. పొడవాటి జుట్టు, గడ్డంతో నాని మాస్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపిస్తున్న ఈ లుక్‌కి అభిమానులు ఫిదా అయ్యారు. "ఇది నాని కెరీర్‌లో బెస్ట్ లుక్" అంటూ కామెంట్ల వర్షం కురుస్తోంది. గతంలో 'దసరా'లో వచ్చిన రఫ్ అండ్ టఫ్ లుక్‌ను మించి ఉండేలా ఈ గెటప్ ఉండడం సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. నాని ఈ సినిమాకోసం ఫిజికల్‌గా చాలా మారిపోయారు. లీన్‌గా, మసిల్డ్ బాడీతో అద్భుతంగా ట్రాన్స్‌ఫామ్ అయిన నాని, ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్, యాటిట్యూడ్‌తో స్క్రీన్‌ను షేక్ చేయబోతున్నారని ఇండస్ట్రీలో టాక్.సినిమాకు అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. ఆల్బమ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మోహన్ బాబు, కయాదు లోహార్, రాఘవ జూయల్ వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన 'రా స్టేట్‌మెంట్' వీడియోకు విశేష స్పందన వచ్చింది. ప్యారడైజ్‌కి సంబంధించిన ప్రతి అప్డేట్‌కు ప్రేక్షకులు ఉత్సాహంగా స్పందిస్తున్నారు. ఈ క్రేజ్ చూస్తుంటే, 'ది ప్యారడైజ్' 2026లోనే కాదు, నాని కెరీర్‌లో కూడా ఓ మైలురాయిగా నిలవనుందని నిశ్చయంగా చెప్పవచ్చు. మూవీ కోసం ఫ్యాన్స్ అయితే ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



## అశ్విన్‌బాబు బర్త్ డే స్పెషల్.. వచ్చినవాడు గౌతమ్ నుంచి పోస్టర్ రిలీజ్



అశ్విన్‌బాబు హీరోగా మామిడాల ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వంలో టి.గణపతిరెడ్డి రూపొందిస్తున్న మెడికల్ యాక్షన్ మిస్టరీ 'వచ్చినవాడు గౌతమ్'. ఇవాళ (ఆగస్టు 1) అశ్విన్ బాబు బర్త్ డే సందర్భంగా ఆయనకు విషెస్ చెబుతూ మేకర్స్ ఒక పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో అశ్విన్‌బాబు ఇంటెన్స్ లుక్‌లో కనిపించాడు. కాగా, ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్ మంచి బజ్ క్రియేట్ చేసింది. 'ధర్మం దారి తప్పినప్పుడు.. ఏ అవతారం రానప్పుడు.. వచ్చినవాడు గౌతమ్' అంటూ మంచు మనోజ్ వాయిస్ ఓవర్‌తో మొదలయ్యే టీజర్ కథానేపథ్యం, యాక్షన్ ఆసక్తిని రేకిత్తించాయి. ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తయ్యింది. ఇటీవల భారీ బడ్జెట్‌తో హైవోల్టేజ్ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ షూట్ పూర్తి చేశారు. హై టెక్నాలజీతో ఈ యాక్షన్ సీక్వెన్స్ తీశారు.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటించనున్నారు. రియా సుమన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అజయ్,%ఖఎ% గణేష్, కీలక పాత్రలు పోహిస్తున్నారు. ఈ చిత్రానికి ఎం.ఎన్. బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ, గౌర హరి మ్యూజిక్ అందిస్తున్నారు. %వీ =% వర్మా ఎడిటర్.